ప్రజాశక్తి
మంగళవారం 18 జులై 2023
8 పేజీలు
విశాఖపట్నం అనకాపల్లి





అదానీ గంగవరం పోర్టు

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

వాటర్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా డిమాండ్

ప్రజాశక్తి - కలెక్టరేట్ : అదానీ గంగవరం పోర్టు కార్మికుల సమస్యలను తక్షణం పరిష్కరించాలని వాటర్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (సిఐటియు) జాతీయ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిడి.నందకుమార్ టి.నరేంద్రరావు డిమాండ్ చేశారు. సోమవారం జగదాంబ దరి సిఐటియు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. క్రోనీ క్యాపిటలిస్ట్ విధానంలో భాగంగా జరిగిన ఒప్పందంలో గంగవరం పోర్టు పూర్తిగా అదానీ చేతికి వెళ్లిందన్నారు. ఆంధ్రప్రదేశ్ సిఎం జగన్మోహన్‌రెడ్డి కూడా మోడీ ప్రభుత్వ ప్రేరేపిత, తిరోగమన విధానానికి అనుగుణంగా వ్యవహరించారని విమర్శించారు. గంగవరం పోర్టును అదానీ స్వాధీనం చేసుకున్న తర్వాత కార్మికులపై శ్రమ దోపిడీ తారాస్థాయికి చేరిందన్నారు. పోర్టు కోసం త్యాగాలు చేసిన వారిని విస్మరించడం శోచనీయమన్నారు. కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయకపోవడం దారుణమన్నారు. సమస్యల పరిష్కారానికి కార్మికులు కొద్ది రోజులుగా దీక్షలు, ధర్నాలు చేస్తున్నా పట్టించుకోకపోవడంపై మండిపడ్డారు. పోర్టు కార్మికుల పోరాటానికి అన్ని రాజకీయ పార్టీల, కార్మిక, ప్రజా సంఘాల మద్దతు లభించిన విషయాన్ని గుర్తు మిగతా 2లో..



మాట్లాడుతున్న నందకుమార్, నరేంద్రరావు

కలెక్టర్‌కు కార్మిక సంఘాల వినతి



కలెక్టరేట్ నుంచి బయటకు వస్తున్న కార్మిక నేతలు

అదానీ గంగవరం పోర్టు కార్మికుల సమస్యలను పరిష్కరించాలంటూ అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు సోమవారం స్పందనలో జిల్లా కలెక్టర్ మల్లికార్జునకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్, హెచ్‌ఎంఎస్ జిల్లా అధ్యక్షులు దొమ్మేటి అప్పారావు, టిఎన్‌టియుసి జిల్లా అధ్యక్షులు నక్కా లక్ష్మణరావు, ఐఎఫ్‌టియు జిల్లా అధ్యక్షులు కె.మల్లయ్య, గంగవరం పోర్టు యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ బి.జగన్ పాల్గొన్నారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ గంగవరం పోర్టు నిర్మాణ కోసం గంగవరం, దిబ్బపాలెం మత్స్యకారులు తమ ఇళ్లను, భూములను, ఉపాధిని కోల్పోయారన్నారు. అటువంటి వారికి పోర్టులో అతి తక్కువ వేతనాలు చెల్లిస్తున్నారన్నారు. 14 సంవత్సరాలకుపైగా పనిచేస్తున్న కార్మికులకు సైతం రూ.13 వేలు నుంచి రూ.16,600కి మించి రావడం లేదన్నారు. డ్యూటీలో జాయిన్ అయినప్పటి నుంచి ఇప్పటి వరకూ రూ.3,700 బేసిక్ మాత్రమే కొనసాగుతోందన్నారు.

కాలుష్య నియంత్రణకు..

బస్సులో మేయర్, సైకిల్‌పై కమిషనర్

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

కాలుష్య నియంత్రణ చర్యల్లో భాగంగా జివిఎంసి మేయర్ గొలగాని హరి వెంకట కుమారి బస్సులోనూ, కమిషనర్ సిఎం.సాయికాంత్ వర్మ సైకిల్‌పైనా సోమవారం కార్యాలయానికి విచ్చేశారు. ప్రతి సోమవారం తమ సొంత వాహనాలను వదిలి, ప్రజా రవాణా వ్యవస్థను ఉపయోగిస్తూ పలువురి ఉద్యోగులకు వీరు ఆదర్శంగా నిలుస్తున్నారు. సోమవారం మేయర్ ఆరిలోవలోని తన క్యాంపు కార్యాలయం నుంచి బస్సులో ప్రయాణించగా, జివిఎంసి కమిషనర్ సైకిల్‌పై కార్యాలయానికి చేరి వారి వారి విధుల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగరంలో వాయు, శబ్ద కాలుష్యం పెరిగిపోయిందని, వాటి నియంత్రణకు ప్రతి ఒక్కరూ కషి చేయాలని కోరారు. నగరంలోని ప్రైవేటు, ప్రభుత్వ సంస్థల యజమాన్యాలు వారంలో ఒక్క రోజు ప్రజా రవాణాను వారి సిబ్బంది ఉపయోగించేలా చూడాలన్నారు. కాలుష్య నియంత్రణలో భాగంగా సాధ్యమైనంత వరకు విద్యుత్ వాహనాలను ఉపయోగించాలన్నారు. కాలుష్య నియంత్రణకు జివిఎంసి విశేష కృషి చేస్తోందని, మొక్కల సంరక్షణ, కార్యాలయంలోకి ఉద్యోగుల వాహనాలను అనుమతించకపోవడం వంటి చర్యలు తీసుకుందని తెలిపారు.



బస్సులో వస్తున్న మేయర్ హరివెంకట కుమారి



సైకిల్‌పై కార్యాలయానికి వస్తున్న కమిషనర్ సాయికాంత్ వర్మ

ఎమ్మెల్యే కన్నబాబురాజు తీరు మార్చుకోవాలి

వార్త 5లో..

గ్రామ స్వరాజ్య స్థాపన దిశగా సమీక్షలు

వార్త 5లో..

రాజన్న ఆటోనగర్ కోసం ధర్నా

వార్త 2లో..

ఇగ్నో అడ్మిషన్ల గడువు పెంపు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఇందిరా గాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో)లో ఈ విద్యా సంవత్సరానికిగానూ వివిధ దూరవిద్యా కోర్సులతోపాటూ ఆన్‌లైన్ కోర్సులలో ప్రవేశాల కోసం గడువును ఈ నెల 31వ తేదీ వరకూ పొడిగించినట్లు ఇగ్నో ప్రాంతీయ సంచాలకులు డాక్టర్ గోనిపాటి ధర్మారావు తెలిపారు. ఈ మేరకు ఆయన సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. విశ్వ విద్యాలయం అందిస్తున్న అన్ని సర్టిఫికెట్, డిప్లొమా, పిజి డిప్లొమా, డిగ్రీ, అన్ని పిజి కోర్సులలో ప్రవేశాలు గడువులోపు లభిస్తాయని తెలిపారు. ఈ విద్యా సంవత్సరానికిగానూ ఇగ్నో అనేక రంగాలలో యువతకు ఉపాధి అవకాశాలను పెంచే కొత్త



కోర్సులను ముందుకు తెచ్చిందని పేర్కొన్నారు. https://ignouadmission.samarth.edu.in లింక్ ద్వారా అడ్మిషన్లు పొందవచ్చునని, మరిన్ని వివరాల కోసం ఇగ్నో వెబ్‌సైట్‌ను చూడాలని కోరారు. ఇగ్నో ప్రాంతీయ కేంద్రాన్ని సంప్రదించవచ్చునని తెలిపారు.

తోపుడు బళ్ల కార్మికుల నిరసన

ప్రజాశక్తి - కలెక్టరేట్ : కొత్త వెంకోజీపాలెం జంక్షన్ వద్ద తోపుడు బళ్లను జివిఎంసి, సచివాలయ సిబ్బంది అన్యాయంగా తొలగించడంపై సోమవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద విశాఖపట్నం తోపుడుబండ్ల కార్మిక సంఘం (సిఐటియు) ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు మద్దిలపాలెం జోన్ కార్యదర్శి మిగతా 2లో..

మళ్లీ గెలిచేది వారే..!

- ఈ నెల 19న స్థాయీ సంఘం ఎన్నికలు
- షీల్డు కవర్ల ద్వారా వైసిపి అధిష్టానం పేర్లు సిఫార్సు
- ఈసారీ అధికార పార్టీదే హవా

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

'రాజకీయాల్లో షీల్డ్ కవర్ల సంస్కృతి' ఏదో ఒక రూపంలో కొనసాగుతూనే ఉంటుందన్నది జివిఎంసి స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో ప్రత్యక్షంగా కనిపిస్తోంది. ఏ పేర్లనైతే వైసిపి పెద్దలు పై నుంచి సూచిస్తారో వారినే ఏటా పోటీకి పెట్టడం కొద్దికాలంగా తెలిసిందే. అధికార సభ్యులు ఏ పార్టీకి అధికంగా ఉంటే వారిదే హవా!. గ్రేటర్ విశాఖ నగర పాలక సంస్థ (జివిఎంసి)లో ఈ నెల 19న బుధవారం జరుగనున్న స్థాయీ సంఘం ఎన్నికల్లో అంతిమంగా ఎన్నికయ్యేది అధికార పార్టీ సభ్యులేనని గణాంకాలు చూస్తే ఇట్టే అర్థమైపోతోంది. రెండేళ్ల పాటు (ఏడాదికి ఒక బ్యాచ్ చొప్పున) రెండు బ్యాచ్‌లు అధికార పాలన ఇప్పటికి సాగించాయి. 10 మంది చొప్పున కార్పొరేటర్లు ఒక దఫా ఎన్నికవవ్వడం పరిపాటిగా మారింది. మెజారిటీ సభ్యులు ఏ పార్టీకి ఉంటే వారే తిరిగి స్థాయీ సంఘంలోనూ అధికారం చెలాయించడం సాధారణమైన విషయంగా ఉంది.

గతంలో ఎలా ఉండేది ?

గతంలో కొన్ని వార్డులకు ఒక స్థాయీ సంఘం సభుడి ఎన్నిక అనే విధానం ఉండేది. దీనివల్ల మిగతా పక్షాల వారికి అవకాశం దక్కేది. వైసిపి అధికారంలోకి వచ్చాక మెజారిటీ సభ్యుల ఓటింగ్‌తో సొంత పార్టీ వారికే బ్యాచ్ బ్యాచ్‌లుగా అవకాశాలు లభిస్తున్నాయి. మూడో బ్యాచ్ పాలన సాగించేందుకు ఈనెల 19న ఎన్నికలు జరుగనున్నాయి. ఎన్నికలనేవి సభ్యుల మెజారిటీ ఓటింగ్ అంశంపై జరిగినా గెలిచేది, స్టాండింగ్ కమిటీల్లో కూర్చొనేది వైసిపి సభ్యులన్నది ప్రత్యేకించి చెప్పాల్సిన పనిలేదు. అయితే, ప్రధాన ప్రతిపక్షంగా తెలుగుదేశానికి జివిఎంసిలో 31 మంది సభ్యుల బలం ఉంది. దీంతో స్థాయీ సంఘం ఎన్నికల్లో ఆ పార్టీ కూడా తన కార్పొరేటర్లను నిలబెడుతోంది. ఈసారి గెలుపునకు తీవ్రంగా ప్రయత్నిస్తోంది.

ఇంతకీ ఒనగూరిందేమిటి ?

స్థాయి సంఘంలో అంతా 'స్వపక్ష ప్రయోజనాల అజెండా'యే ఉంటుందనే విమర్శ ఉంది. రూ.50 లక్షలలోపు ఉండే పనులకు స్థాయీ సంఘంలో వారు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చేయవచ్చు. అలాగే నగరంలోని ప్రధాన మార్కెట్‌లు, షాపులు, కల్యాణ మండపాలు ఇతర జివిఎంసి ఆస్తుల మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

చేశారు. ఈ నేపథ్యంలో సమస్యను పోర్టు యాజమాన్యం, అధికారులు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో విశాఖపట్నంతో సహా అన్ని మేజర్ పోర్టుల్లో, అదానీ గ్రూప్ నిర్వహిస్తున్న ఇతర పోర్టుల్లోని కార్మికులనూ ఏకం చేసి ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. అలాగే మేజర్ పోర్టుల వేతనం ఒప్పందంపై విశాఖలోని నోవాటెల్ హోటల్‌లో ఆదివారం చర్చలు జరిగాయని, ఐదు సంవత్సరాల పిరియడ్‌కు యాజమాన్యం అంగీకరించిందని అన్నారు. ఆగస్టు 31, సెప్టెంబరు 1 తేదీలలో ఢిల్లీలో మరో సమావేశం జరగబోతుందన్నారు. ఈలోపు సమస్యలను పరిష్కరించకుంటే పోర్టు కార్మికులు సమ్మెకు దిగుతారని తెలిపారు. సమావేశంలో విశాఖపట్నం పోర్టు యూనియన్ గౌరవ అధ్యక్షులు వివిఎస్.పద్మనాభరాజు, ప్రధాన కార్యదర్శులు బి.లక్ష్మణరావు, కె.సత్యనారాయణ, జె.సత్యనారాయణ, రామలింగేశ్వరరావు, బి.జగన్ పాల్గొన్నారు.



గంగవరం పోర్టు కార్మికులకు మద్దతు తెలుపుతూ మాట్లాడుతున్న పైడిరాజు

సిపిఐ మద్దతు

గాజువాక : అదానీ గంగవరం పోర్టు కార్మికులు చేస్తున్న ఉద్యమానికి సిపిఐ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. కనీస వేతనాల అమలు కోసం అదానీ గంగవరం పోర్టు కార్మికులు పెదగంట్యాడలో చేపట్టిన నిరవధిక నిరసన దీక్షలు సోమవారానికి 14వ రోజుకు చేరుకున్నాయి. దీక్షా శిబిరాన్ని సిపిఐ విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు సందర్శించి మాట్లాడారు. కార్మికులకు కనీస వేతనం అమలు చేయకుండా అదానీ కుట్ర పూరితంగా వ్యవహరిస్తూ, తీవ్ర నిర్బంధాన్ని ప్రయోగిస్తున్నారని విమర్శించారు. పోలీసు బలగాలతో కార్మిక ఉద్యమాన్ని అణచాలని చూస్తే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు క్షేత్రపాల్, కసిరెడ్డి సత్యనారాయణ, పి.చంద్రశేఖర్, సత్యాంజనేయ, జి.రాంబాబు, ఆర్.శ్రీనివాసరావు, ఎ.విమల, భేగం, ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వై.రాంబాబు, కె.అచ్యుతరావు, గాజువాక నియోజకవర్గ నాయకులు పల్లేటి పోలయ్య, జి.ఆనంద్, అప్పారి విష్ణుమూర్తి, పి.దుర్గారావు, వై.నందన్న పాల్గొన్నారు.

తోపుడు బళ్ల కార్మికుల నిరసన

పి.వెంకటరావు మాట్లాడుతూ తోపుడుబండ్ల కార్మికులకు రక్షణ కల్పించాలని, వారందరికీ గుర్తింపు కార్డులు ఇవ్వాలని సుప్రీంకోర్టు ఆదేశాలు ఉన్నాయన్నారు. వాటిని ధిక్కరిస్తూ అధికారులు వ్యవహరించడం సరికాదన్నారు. తోపుడుబండ్ల కార్మికుల ఉపాధికి రక్షణ కల్పించాలని, నగర పరిధిలో హాకర్ జోన్లు ప్రత్యేకంగా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో శ్రీ వీరాంజనేయ తోపుడుబండ్ల సంక్షేమ సంఘం కొత్త వెంకోజీ పాలెం కమిటీ అధ్యక్షులు ఎం.అర్జున, కార్యదర్శి ఎం.శివ పాల్గొన్నారు.

మళ్లీ గెలిచేది వారే..!

వేలం పాటలు, ముఖ్యంగా లీజులు విషయాల్లో స్టాండింగ్ కమిటీ సభ్యులదే పైచేయి. కార్పొరేషన్ జనరల్ బాడీ సమావేశంలో సభ్యుల మధ్య పనులపై జరిగే చర్చ, అనుమతులపై రచ్చ ఎంతో కొంత న్యాయబద్ధంగా సాగినా స్టాండింగ్ కమిటీలో అడిగేవారుండరు. ఉన్నవారంతా అధికార పార్టీవారే. దీంతో వారి ఇష్టారాజ్యం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. కౌన్సిల్ సమావేశంలో మిగతా ప్రతిపక్షాల ఆమోదం లభించని పనులను ఓకే చేయించుకుని ప్రయోజనం పొందడమే లక్ష్యంగా స్థాయీ సంఘం పనితీరు సాగుతోంది.

స్టాండింగ్ కమిటీ ఎన్నికలకు సిపిఐ కార్పొరేటర్ దూరం

కలెక్టరేట్ : ఈ నెల 19న జరగనున్న జివిఎంసి స్టాండింగ్ కమిటీ ఎన్నికలకు సిపిఐ కార్పొరేటర్ ఎజె.స్టాలిన్ దూరంగా ఉంటారని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎం పైడిరాజు, కార్పొరేటర్ స్టాలిన్ ఓ ప్రకటనలో సోమవారం తెలిపారు. స్టాండింగ్ కమిటీలో 10 మందిని ఎన్నుకోవలసి ఉండగా అధికార వైసిపి నుంచి పది మంది, టిడిపి నుంచి పది మంది పోటీలో ఉన్నారని చెప్పారు. అయితే ఈ ఎన్నికల్లో క్రాస్ ఓటింగ్ అధికంగా జరిగే అవకాశం ఉందన్నారు. ఈ నేపథ్యంలో సిపిఐ ఈ ఎన్నికలలో పాల్గొనకుండా దూరంగా ఉండాలని పార్టీ నిర్ణయించిందని చెప్పారు.

బినామీలకు షాపుల కేటాయింపుపై ఫిర్యాదు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఎస్‌సి కార్పొరేషన్ సహాయంతో ఏర్పాటు చేసిన వాణిజ్య దుకాణాల సముదాయంలో బినామీలను రద్దుచేసి నిరుద్యోగ యువతి యువకులకు షాపులు కేటాయించాలని ఎస్‌సి మోర్చా అధ్యక్షులు ముటకలపల్లి ప్రకాష్ విజ్ఞప్తి చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట జరిగిన ధర్నాలో ఆయన మాట్లాడుతూ విశాఖ స్టీల్‌ప్లాంట్ నిర్మాణం కోసం దళితుల భూములు స్వాధీనం చేసుకున్న ప్రభుత్వం వారి కోసం పెదగంట్యాడ మండలంలో ఎస్‌సి కార్పొరేషన్ సహాయ సహకారంతో 32 వాణిజ్య షాపుల సముదాయం నిర్మించిందన్నారు. ప్రస్తుతం అక్కడ బినామీల రాజ్యం నడుస్తోందని తెలిపారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

రాజన్న ఆటోనగర్ కోసం ధర్నా

రూ.14 కోట్లు మంజూరైనట్లు కలెక్టర్ వెల్లడి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : స్క్రాప్ వర్కర్ల కోసం ఆనందపురం మండలం కమనం గ్రామంలో రాజన్న ఆటోనగర్ నిర్మించాలంటూ స్క్రాప్ వర్కర్స్ అండ్ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం విశాఖ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం కలెక్టర్ ఎ.మల్లికార్జునకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ 2019లో స్క్రాప్ వర్కర్స్ స్మార్ట్ సిటీ పేరిట ఆనందపురం మండలం కమనం గ్రామం వద్ద 157.7 ఎకరాలను కేటాయించారని, వైసిపి ప్రభుత్వం వచ్చిన తరువాత రాజన్న ఆటోనగర్ పేరిట దీనికి సంబంధించిన జిఒ కూడా వచ్చిందని, అయినప్పటికీ ఇంతవరకూ సదరు కార్మికులకు ఆ స్థలాన్ని ఇవ్వలేదని అన్నారు. ఈ సమస్యపై మూడేళ్లుగా ఆందోళనలు చేస్తున్నా పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు.



ధర్నా చేస్తున్న స్క్రాప్ వర్కర్లు

త్వరలోనే పనులు చేపడతామని కలెక్టర్ వెల్లడి

రాజన్న ఆటోనగర్ నిర్మాణానికి రూ.14 కోట్లు విడుదలయ్యాయని, మరో రూ.4 కోట్లు నాలుగు రోజుల్లో విడుదల కానున్నాయని, ఆ వెంటనే ఆటోనగర్ నిర్మాణ పనులను చేపడతామని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున చెప్పారని సిఐటియు జగదాంబ జోన్ ప్రధాన కార్యదర్శి కెవిపి.చంద్రమౌళి, స్క్రాప్ వర్కర్లు తెలిపారు. నిధులు మంజూరుపై స్క్రాప్ వర్కర్స్ అండ్ ఓనర్స్ అసోసియేషన్ నాయకులు విజయ్, సత్యనారాయణ, గణేష్ హర్షం వ్యక్తం చేశారు. సిఐటియు సీనియర్ నాయకులు వై.రాజు స్పందిస్తూ అందరూ ఐక్యంగా ఉద్యమంలో పాల్గొంటేనే విజయం సాధ్యమన్నారు. నిధుల మంజూరు ప్రకటనతో ఉద్యమాన్ని ఆపేయరాదని, ప్రతి ఒక్కరికీ ఆటోనగర్‌లో ఇళ్లు, ఇళ్ల స్థలాలు, షాపింగ్ స్థలాలు వచ్చేవరకూ పోరాడాలని పిలుపునిచ్చారు.

చిత్రలేఖన పోటీల్లో విజేతలకు బహుమతులు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న మేయర్, కమిషనర్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ

విద్యార్థులలో పర్యావరణంపై అవగాహన పెంపొందించేందుకు చిత్రలేఖన పోటీలు అవసరమని నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి పేర్కొన్నారు. సోమవారం ఆమె జివిఎంసి ప్రధాన కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఇకో-వైజాగ్ కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలోని విద్యార్థులకు ఈ నెల 7వ తేదీన నిర్వహించిన పర్యావరణంపై చిత్రలేఖన పోటీలలో ఉత్తమ చిత్రాలు గీసిన విద్యార్థులకు కమిషనర్ సిఎం.సాయికాంత్ వర్మతో కలిసి బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ విద్యార్థులలో పర్యావరణంపై సృజనాత్మకను పెంపొందించేందుకు ఇటువంటి చిత్రలేఖన పోటీలు అవసరమన్నారు.

592 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లోని 30 వేల మంది విద్యార్థులు ఈ చిత్రలేఖన పోటీల్లో పాల్గొనగా వారిని సీనియర్, జూనియర్ విభాగాలుగా విభజించి పోటీలు నిర్వహించామన్నారు. విజేతలకు మొదటి బహుమతి రూ.25 వేలు, రెండవ బహుమతి రూ.15 వేలు, 3వ బహుమతి రూ.10 వేలు, అలాగే జూనియర్ విభాగానికి మొదటి బహుమతి రూ.15 వేలు, రెండవ బహుమతి రూ.10 వేలు, 3వ బహుమతి విభాగానికి ఇద్దరిని ఎంపిక చేసి, వారికి ఒక్కొక్కరికీ రూ.3500 చొప్పున బహుమతులు ఇవ్వడంతోపాటు సర్టిఫికెట్, మెమొంటోలు ఇస్తున్నామన్నారు. మరో 20 మందికి ప్రత్యేక బహుమతులు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో వైసిపి ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాస రావు తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో రోడ్లు


రాళ్లు తేలిన హాస్టల్ రోడ్డు

ప్రజాశక్తి-ఆనందపురం : మండలంలోని శ్రీ భూలోక మాత ఆలయం సమీపంలోనిప్రభుత్వ బాలికల వసతి గృహానికి వెళ్లే తారు రోడ్డు పూర్తిగా శిథిలం కావడంతో విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎల్‌వి పాలెం పంచాయతీ శ్రీ భూలోక మాత గుడి సమీపంలో గల శ్రమజీవుల కాలనీ మీదుగా ప్రభుత్వ బాలికల వసతి గృహానికి ఉన్న తారు రోడ్డు పూర్తిగా శిథిలమై రాళ్లు తేలిపోయాయి. దీంతో హాస్టల్ విద్యార్థినులు, శ్రమజీవుల కాలనీవాసులు ఈ రోడ్డు గుండా వెళ్లడానికి అవస్థలు పడుతున్నారు. నిధులు మంజూరు చేసి పూర్తిస్థాయిలో రోడ్డును ఏర్పాటుచేయాలని కాలనీవాసులు, హాస్టల్ విద్యార్థినులు, సిబ్బంది కోరుతున్నారు.

గుంతలు పడిన దొంతల వారి కల్లాల రోడ్డు

ఆనందపురం పంచాయతీ దొంతల వారి కల్లాల రోడ్డు గుంతలమయమైంది. వర్షం పడితే గుంతలు చెరువును తలపిస్తున్నాయి. పూర్తిగా శిథిలమైన ఈ రహదారిని తారురోడ్డుగా ఏర్పాటు చేయడానికి నాలుగేళ్ల క్రితం నిధులు మంజూరు చేశారు. భీమిలికి చెందిన కాంట్రాక్టర్ రమేష్ పనులు ప్రారంభించారు. అప్పట్లో మెటల్ వేసిన అనంతరం కాంట్రాక్టర్ మృతిచెందడంతో రోడ్డు పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. తర్వాత వర్షాలకు రోడ్డు మరింత గుంతలమయమైంది. వర్షాకాలం నేపథ్యంలో రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని పంచాయతీ పాలకవర్గాన్ని గ్రామస్తులు కోరుతున్నారు.


గుంతలు పడిన దొంతల వారి కల్లాల రోడ్డు

నేరాలు ఘోరాలు

దాడి ఘటనలో ఒకరు మృతి

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం మండలం, గండిగుండం సమీపం రామవరం వెళ్లే దారిలో ఇద్దరు వ్యక్తులు మద్యం మత్తులో పాన్ షాప్ వ్యక్తితో పడిన ఘర్షణలో ఒకరు మృతి చెందారు. దీనికి సంబంధించి పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం... యారాడ సాయిబాబా టెంపుల్ ప్రాంతానికి చెందిన బంక అజయ్ (32), హోంగార్డు కోన శ్రీను (24) ద్విచక్రవాహనంపై రామవరంలో రమణ ఇంటికి ఆదివారం రాత్రి వచ్చారు. తిరుగు ప్రయాణంలో రాత్రి ఎనిమిది గంటల సమయంలో బైక్‌పై అతివేగంగా వచ్చి రామవరం రోడ్డులో పక్కన ఉన్న అక్కిరెడ్డి బంగార్రాజు, జగదీశ్వరిల పాన్ షాప్ ముందు నిలిపారు. ఎవరు మీరు, ఎందుకు నిలబడ్డారని షాపు యజమాని బంగారురాజు ప్రశ్నించారు. దీంతో వాహనంపై వచ్చిన బంక అజయ్ వాగ్వాదానికి దిగాడు. బంగార్రాజును పిడుగుద్దులు గుద్దాడు. దీంతో బంగార్రాజు భార్య జగదీశ్వరి అడ్డుకునే ప్రయత్నం చేసింది. జగదీశ్వరి తండ్రి భీమవరపు దేముడు (46) తగాదాని చూసి బయటకు వచ్చి ప్రశ్నించారు. ప్రశ్నించిన దేముడు గుండెలపై అజయ్ బలంగా గుద్దాడు. దీంతో తీవ్ర నొప్పితో దేముడు స్పృహ తప్పి పడిపోయాడు. వెంటనే కుమార్తె జగదీశ్వరి, అల్లుడు బంగార్రాజు ఆసుపత్రికి తరలించగా తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. సిఐ రామచంద్రరావు, ఎఎస్ఐ పైడిరాజు సంఘటనా స్థలానికి చేరుకుని నిందితులను అదుపులోకి తీసుకున్నారు.

కాంట్రాక్టు కార్మికుడు ఆత్మహత్య

ప్రజాశక్తి-ఉక్కునగరం : విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ సెక్టర్ - 1లో కణితి ఈశ్వరరావు (46) ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్టీల్‌ప్లాంట్ పోలీసులు, మృతుని భార్య రమణమ్మ కథనం ప్రకారం... ఈశ్వరరావు స్టీల్‌క్లబ్‌లో కాంట్రాక్ట్ లేబర్‌గా పనిచేస్తున్నాడు. గత కొంతకాలంగా తాగి విధులకు హాజరుకావడంతో 15 రోజుల క్రితం స్టీల్‌క్లబ్ యాజమాన్యం సస్పెండ్ చేసింది. మానసికంగా వేదనకు గురైన అతను మరింత ఎక్కువగా మద్యం తాగుతున్నాడు. సోమవారం మధ్యాహ్నం మూడు గంటల సమయంలో తాగిన మత్తులో ఇంటికి వచ్చాడు. గదిలోకి వెళ్లాడు. సాయంత్రం 6 గంటలైనా బయటకు రాకపోవడంతో భార్య రమణమ్మ తలుపు తట్టింది. ఎంతకీ తలుపులు తెరవకపోవడంతో రమణమ్మ తన సోదరుడు ఆరిపాక గౌరీ శంకర్‌కు ఫోన్ చేసింది. గౌరీశంకర్ వచ్చాక బలవంతంగా తలుపు తెరిచారు. అప్పటికే అతను సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఉన్నాడు.కిందికి దించి స్టీల్‌ప్లాంట్ జనరల్ హాస్పిటల్‌కు తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు డ్యూటీ డాక్టర్ నిర్ధారించారు. మృతుని భార్య రమణమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

బీసీ రోడ్డు షాపుల్లో చోరీ

ప్రజాశక్తి -గాజువాక : గాజువాక బీసీ రోడ్డు షాపుల్లో ఆదివారం అర్ధరాత్రి చోరీ జరిగింది. ఈ చోరీకి సంబంధించి క్రైమ్ పోలీసుల కథనం ప్రకారం... బీసీ రోడ్డులో రెండు మెడికల్ షాపులు, ఒక బేకరి, ఫిష్ అక్వేరియంలో దొంగలు చోరీకి పాల్పడ్డారు. చోరీలో మొత్తం రూ.10 వేలు నగదు పోయినట్లు షాప్ నిర్వాహకులు ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గెడ్డలపై ఆకర్షణీయమైన స్క్రీనింగ్

జివిఎంసి కమిషనర్ సాయికాంత్ వర్మ



గెడ్డల వద్ద వేసిన స్క్రీనింగ్‌ను పరిశీలిస్తున్న సాయికాంత్‌వర్మ

ప్రజాశక్తి -మధురవాడ : నగరంలోని ప్రధాన గెడ్డలపై ఆకర్షణీయమైన స్క్రీనింగ్ ఏర్పాటుచేయాలని జివిఎంసి కమిషనర్ సిఎం.సాయికాంత్‌వర్మ అధికారులను ఆదేశించారు. రుషికొండ, సాగర్‌నగర్, ఎంవిపి.కాలనీ తదితర ప్రాంతాలలో గెడ్డలపై ఏర్పాటు చేసిన ఆకర్షణీయమైన స్క్రీనింగ్‌ను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా నగరంలోని ప్రధాన గెడ్డలపై రోడ్డుకిరువైపులా కల్వర్టులకు ఆకర్షణీయంగా ఆ ప్రాంత నామాన్ని తెలుపుతూ వ్యర్థాలతో తయారుచేసిన నమూనాలను ఏర్పాటుచేయాలని ఆదేశించారు. రుషికొండ బీచ్‌లోని గెడ్డ కనిపించకుండా ఏర్పాటుచేసిన ఆకర్షణీయమైన ఆకృతి, సాగర్‌నగర్‌లో 50 వేల ప్లాస్టిక్ మూతలతో ఏర్పాటుచేసిన "క్లీన్ అవర్ సి" ప్లాస్టిక్ ఫ్రీ నినాదంతో తీర్చిదిద్దినట్లు తెలిపారు. ఎంవిపిలో గెడ్డపై మొక్కల కుండీలతో వినూత్నంగా తీర్చిదిద్దినట్లు చెప్పారు. నగరంలో 44 ప్రధాన గెడ్డలను గుర్తించి, ఆయా ప్రాంతాలు తెలిపే ఆకృతులను ఆకర్షణంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. ఈ పర్యటనలో డిటిహెచ్ దామోదరరావు, జోనల్ కమిషనర్ విజయలక్ష్మి, జివిఎంసి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

స్పందనకు 6 అర్జీలు

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక జివిఎంసి ఒకటో జోన్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనలో జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాముకు పలు సమస్యలపై 6 అర్జీలు అందాయి. పట్టణ ప్రణాళిక విభాగానికి సంబంధించి 1, ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించి 5 అర్జీలను పలువురు అందజేశారు.

రెండో వార్డులో కార్పొరేటర్ పర్యటన

ప్రజాశక్తి- తగరపువలస : జివిఎంసి రెండో వార్డు పరిధి సంగివలస, ఉప్పాడపేట ప్రాంతాల్లో రెండో వార్డు కార్పొరేటర్ గాడు చిన్ని కుమారి లక్ష్మి, జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము, ఇతర సిబ్బందితో కలిసి సోమవారం పర్యటించారు. పలు చోట్ల మురుగు నీరు బయటకు పోయేలా చర్యలు తీసుకోవాలని జోనల్ కమిషనర్‌ను కార్పొరేటర్ కోరారు. ఉప్పాడ పేట, బుడుమూరి వారి ఇళ్ల నుంచి జాతీయ రహదారి వరకు సిమెంట్ రోడ్డు, కాల్వ నిర్మాణం చేపట్టాలని స్థానికులు కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి స్థానిక నాయకులు గాడు అప్పలనాయుడు, జయశంకర్, ఉప్పాడ దుర్గారావు, బి.సూర్యనారాయణ, జోగ సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నను దర్శించిన ప్రముఖులు

ప్రజాశక్తి-సింహాచలం: సింహాద్రి అప్పన్నను సోమవారం తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి ఇవి.వేణుగోపాల్, విశాఖ నగర పోలీస్ కమిషనర్ త్రివిక్రమవర్మ దంపతులు వేర్వేరుగా దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ఆలయ సంప్రదాయం ప్రకారం స్వాగతం పలికారు. వీరు ముందుగా కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. బేడా మండపం చుట్టూ ప్రదక్షిణ చేశారు. స్వామి అంతరాలయంలోనూ, గోదాదేవి సన్నిధి లోనూ, గోత్రనామాలతో ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం ఆస్థాన మండపంలో అర్చకులు ఆశీర్వదించారు. వారిని ఎఇఒ భ్రమరాంబ సత్కరించి, స్వామివారి ప్రసాదాన్ని, చిత్రపటాన్ని అందించారు.

ఘనంగా అమావాస్య తిరువీధి

సింహాచలం: సింహగిరిపై స్వామి ఆలయంలో అమావాస్యను పురస్కరించుకొని తిరువీధోత్సవాన్ని అత్యంత వైభవంగా అర్చకులు నిర్వహించారు. ఈ ఉత్సవం సందర్భంగా స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి పల్లకిలో ఉంచి ప్రత్యేక పూజలు జరిపారు. అత్యంత వైభవంగా తిరువీధి నిర్వహించారు.

గీతంలో విద్యార్థుల సర్టిఫికెట్ల పరిశీలన


నూతన విద్యార్థుల సర్టిఫికెట్లను పరిశీలిస్తున్న గీతం సిబ్బంది

ప్రజాశక్తి-మధురవాడ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో ఇంజనీరింగ్, ఫార్మసీ, ఆర్కిటెక్చర్, సైన్స్, లా, మేనేజ్‌మెంట్, హ్యూమానిటీస్, నర్సింగ్, పారామెడికల్ కోర్సులలో 2023 విద్యాసంవత్సరానికి ప్రవేశాలు పొందిన విద్యార్థులకు సోమవారం సర్టిఫికెట్ల పరిశీలన, వసతి గృహాలలో ప్రవేశాలు, అవగాహన తరగతులను ప్రారంభించారు. జాతీయ స్థాయిలో నిర్వహించిన గీతం ప్రవేశ పరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు ర్యాంకుల ఆధారంగా వివిధ కోర్సుల్లో ప్రవేశాలు కల్పించారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన విద్యార్థులతో విశ్వవిద్యాలయంలో సందడి నెలకొంది. విద్యార్థుల సౌకర్యార్థం హెల్ప్ డెస్క్‌లతో పాటు బస్‌పాస్ సౌకర్యం తదితర సమాచార కేంద్రాలను ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా శివాజి ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో గీతం కేంపస్ లైఫ్ ప్రో-వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వై.గౌతమరావు మాట్లాడుతూ, గీతంలో ప్రవేశం పొందే ప్రతి విద్యార్థి పట్ల వ్యక్తిగత శ్రద్ధ చూపుతున్నామని, కెరీర్ గైడెన్స్ విభాగాన్ని బలోపేతం చేసామని తెలిపారు. గీతం నుంచి ఏటా 3000 వేల మంది విద్యార్థులు ఉద్యోగాలు సాధిస్తున్నారని పేర్కొన్నారు. ఎన్ఎస్ఎస్, ఎన్‌సిసి విభాగాలతో పాటు క్రీడలలో విద్యార్థులను ప్రోత్సహిస్తున్నట్లు చెప్పారు. విద్యార్థులు ఉచితంగా ఆన్‌లైన్ సర్టిఫికెట్ కోర్సులు అభ్యసించేలా "కురసెరా" సంస్థతో ప్రత్యేక ఒప్పందం చేసుకున్నామన్నారు. అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో ఉన్నత విద్యను అందించడమే లక్ష్యంగా ప్రణాళికాయుతంగా ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. నూతనంగా ప్రవేశం పొందిన విద్యార్థులకు రెండు వారాల పాటు నాయకత్వ లక్షణాలు, వ్యక్తిత్వవికాసం, నైతిక విలువలు తదితర అంశాలపై అవగాహన తరగతులను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల సందర్శన

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక ఎస్‌విఎల్ఎన్ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలను కళాశాల విద్య జోన్-1 అధికారి డాక్టర్ ఎస్.శోభారాణి సోమవారం సందర్శించారు. కళాశాల ప్రాంగణాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. నైతిక విలువలు పెంపొందించుకుంటూ సమాజాభివృద్ధికి దోహద పడాలని విద్యార్థులకు సూచించారు. అనునిత్యం సృజనాత్మకంగా ఆలోచించాలని కోరారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్.మంజుల, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఘనంగా ఆనందగజపతిరాజు జయంతి

ప్రజాశక్తి-సింహాచలం: సింహాచల దేవస్థానం అనువంశిక ధర్మకర్త, కీర్తిశేషులు పూసపాటి ఆనందగజపతిరాజు 74వ జయంతిని సింహాచలం దేవస్థానం అధికారులు పరిపాలన భవనంలో ఘనంగా నిర్వహించారు. ఆనందగజపతిరాజు చిత్రపటానికి పూలమాలలు వేశారు. సింహాచలం దేవస్థానం అభివృద్ధికి ఇక్కడ ప్రజల సంక్షేమానికి ఆనందగజపతిరాజు చేసిన కృషిని ఈఈ శ్రీనివాసరాజు కొనియాడారు. ఆయన జయంతిని పురస్కరించుకొని సింహాచల దేవస్థానానికి చెందిన సంస్కృత పాఠశాలలో చదివి పదో తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు పొందిన విద్యార్థికి నగదు ప్రోత్సాహంగా రూ.5000 అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థానానికి చెందిన వివిధ విభాగాల అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా హెచ్‌పిసిఎల్ వ్యవస్థాపక దినోత్సవం



మొక్కలు నాటుతున్న హెచ్‌పిసిఎల్ ప్రతినిధులు

ప్రజాశక్తి -ములగాడ : మల్కాపురంలో ఉన్న హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ సంస్థ 49వ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఘనంగా జరుపుకుంది. ఈ నెల 15వ తేదీన ప్రారంభించి మూడు రోజుల పాటు సంస్థలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. శనివారం సంస్థ ఇన్‌ఛార్జి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వి.రతన్‌రాజ్ సమక్షంలో విశాఖ రిఫైనరీలో ప్లాంటేషన్ కార్యక్రమాన్ని చేపట్టారు. ఇడి రామకృష్ణన్, అన్ని విభాగాల సిజిఎంలు, డిప్యూటీ కమాండెంట్ (సిఐఎస్ఎఫ్), రిఫైనరీ ఉద్యోగులు, కుటుంబ సభ్యులు కలిసి వివిధ ప్రదేశాలలో 2500 మొక్కలు నాటారు. విశాఖ రిఫైనరీ, యారాడ పార్క్, సిఐఎస్ఎఫ్ హౌసింగ్ కాలనీ, ఆఫీసర్స్ కాలనీల్లో పర్యావరణాన్ని పరిరక్షణకు పక్షుల గూళ్ళను అభివృద్ధి చేయడానికి చర్యలు చేపట్టారు.

సోమవారం రోటరీ బ్లడ్ బ్యాంక్ సమన్వయంతో హెచ్‌పిసిఎల్ విశాఖ రిఫైనరీలో రక్తదాన శిబిరాన్ని వి.రతన్‌రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ, శిబిరంలో 120 మంది రక్తదానం చేశారని తెలిపారు. హెచ్‌పిసిఎల్ హౌసింగ్ కాలనీలలో మరో రెండు రక్తదాన శిబిరాలను ఏర్పాటుచేసినట్లు చెప్పారు. యారాడ పార్క్, వాల్తేరు పార్క్, హెచ్‌పి శక్తి, హెచ్‌పి స్త్రీ బృందాలచే నిర్వహించిన రక్తదాన శిబిరాలలో 100 మందికిపైగా రక్తదానం చేసినట్లు తెలిపారు. 49వ వ్యవస్థాపక దినోత్సవంలో భాగంగా ఈ గోల్డెన్ జూబ్లీ ఇయర్‌లో పలు సేవా కార్యక్రమాలను నిర్వహించడానికి ప్రణాళికను సిద్ధం చేసినట్లు వివరించారు. విశాఖ రిఫైనరీ పరిసరాల్లో మెగా వైద్య శిబిరం, కంటి తనిఖీ శిబిరం, పర్యావరణ సమతుల్యతను మెరుగుపరిచేందుకు విశాఖపట్నం పరిసర ప్రాంతాల్లో 50 వేలు మొక్కలు నాటడం, సాధారణ ప్రజల ఉపయోగం కోసం మల్కాపురం పోలీస్ స్టేషన్ సమీపంలో శుద్ధ మంచినీటి వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. గుల్లలపాలెం వుడా కాలనీలో పార్క్‌ను అభివృద్ధి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు, కార్మికులు పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న హెచ్‌పిసిఎల్ ఉద్యోగులు



తాగునీటి బోరు ఏర్పాటుకు శంకుస్థాపన చేస్తున్న ధనలక్ష్మీశంకర్

తాగునీటి బోరుకు శంకుస్థాపన

ప్రజాశక్తి-విశాఖపట్నం : జివిఎంసి 18వ వార్డు సెక్టర్ -7 ప్రియదర్శి కాలనీలో తాగునీటి బోరు ఏర్పాటు పనులకు వార్డు వైసిపి ఇన్‌ఛార్జి పుక్కళ్ళ ధనలక్ష్మీశంకర్ సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ధనలక్ష్మీశంకర్ మాట్లాడుతూ, చాలాకాలంగా ఈ ప్రాంతంలో తాగునీరు బోరు వేయించాలని స్థానికులు విన్నవిస్తున్న నేపథ్యంలో విఎంఆర్‌డిఎ ఛైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల దృష్టికి తీసుకెళ్లడంతో బోరును మంజూరు చేయించారని తెలిపారు. ఈ బోరు ఏర్పాటుద్వారా ఈ ప్రాంతంలో తాగునీటి సమస్యకు పరిష్కారం లభించినట్లయిందన్నారు. ఈ కార్యక్రమంలో కాశి, రమణబాబు, శ్యామల, గణేష్ తదితరులు పాల్గొన్నారు.



అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఐఎఫ్‌టియు ప్రతినిధులు

బిజెపి పాలనలో దళితులపై దాడులు

ప్రజాశక్తి-పెందుర్తి : కేంద్రంలో బిజెపి ప్రభుత్వం వచ్చిన తర్వాత దళితులపై అనేక దాడులు జరిగాయని ఐఎఫ్‌టియు రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకటేశ్వరరావు ఆరోపించారు. కారంచేడు అమరవీరుల 35వ వర్ధంతిని సోమవారం అంబేద్కర్ విగ్రహం వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కారంచేడు ప్రజలు మానవ హక్కులు అడిగినందుకే వారిపై దాడి జరిగిందన్నారు. ఈ ఉద్యమంతోనే 1985 చట్టం కూడా అమలులోకి వచ్చిందని తెలిపారు. లక్ష్మీపేటలో దళితులపై హత్యాకాండ జరిగిందని గుర్తు చేశారు. కరోనా సమయంలో సేవలందించిన డాక్టర్లకు కరోనా కిట్లు లేవన్నందుకే ఆ డాక్టర్‌పై వైసిపి ప్రభుత్వం భౌతిక దాడులు చేసిందని ఆరోపించారు. ప్రజలందరూ సమరశీల పోరాటం చేయడం ద్వారా హక్కులు సాధించుకోగలుగుతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పిఒడబ్ల్యు సంఘ సభ్యులు ఇందిర, అరుణోదయ సంఘం సభ్యులు నిర్మల తదితరులు పాల్గొన్నారు.



సిఐ జిడి.బాబును కలిసిన సంఘ సభ్యులు, సలహాదారులు

సిఐని కలిసిన విజ్ఞానమండలి సభ్యులు

ప్రజాశక్తి -ములగాడ : మల్కాపురం పోలీస్‌స్టేషన్ సిఐగా బాధ్యతలు చేపట్టిన జిడి.బాబును గొల్లవీధి విజ్ఞానమండలి యాదవ సంఘం నూతన పాలకవర్గ సభ్యులు మర్యాద పూర్వకంగా కలిశారు. సాలువాతో సత్కరించి, జ్ఞాపికను అందించారు. అనంతరం సిఐ మాట్లాడుతూ, పారిశ్రామిక ప్రాంతంలో శాంతిభద్రతల సమస్యలపై దృష్టి సారిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం పాలకవర్గ సభ్యులు ఉరుకోటి అప్పలరాజు, నూనెల నాయుడు, జి.శంకర్, చట్టి శివకుమార్, పవన్‌కల్యాణ్, నూనెల ప్రసాద్, ఊరుకోటి యశ్వంత్, నూనెల కృష్ణ, సంఘ సలహాదారులు నూనెల పైడిరాజు, నూనెల నూకరాజు, ఎదురి భాస్కర్, కిలాని పైడిరాజు, శీర చిన్నాజీ, ఉరుకోటి అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

బిజెపితో మహిళా చట్టాలకు తూట్లు



సదస్సులో మాట్లాడుతున్న రమణి

ప్రజాశక్తి-పెందుర్తి : బిజెపి ప్రభుత్వం మహిళా చట్టాలకు తూట్లు పొడుస్తోందని ఐద్వా నాయకులు బి.రమణి విమర్శించారు. పెందుర్తిలోని సిఐటియు కార్యాలయంలో సోమవారం మహిళా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, సోషల్ మీడియా అభివృద్ధి చెందాక మహిళలను అశ్లీలంగా చూపడం ఎక్కువైందన్నారు. ఎన్ని చట్టాలు తెచ్చినా మహిళలకు రక్షణ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా యువత మత్తు పదార్థాలకు బానిసైనా ప్రభుత్వం ఎటువంటి చర్యలూ తీసుకోవడం లేదని విమర్శించారు. మహిళలు ఇంటి నుంచి బయటకు వచ్చి తిరిగి వెళ్లే వరకు భయంతోనే ఉండాల్సిన పరిస్థితి దాపురించిందని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళల హింసపై ఐద్వా ఆధ్వర్యాన ఈ నెల 28 నుంచి ఆగస్టు 8వ తేదీ వరకు చేపట్టే పోరు యాత్రను జయప్రదం చేయాలని కోరారు.

ఐద్వా నాయకులు లీల మాట్లాడుతూ, తెలంగాణలో ప్రియాంక ఘటన ప్రజలను కలిచి వేసిందన్నారు. మహిళలు, చిన్నారులకు రక్షణ కల్పించే చట్టాలను అమలు చేయాలని, ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల ద్వారా త్వరితగతిన విచారణ జరిపి నిందితులకు కఠినమైన శిక్షలు విధించాలని డిమాండ్ చేశారు. మహిళలందరూ ఐక్యంగా పోరాటం చేయడం ద్వారా సమస్యలు పరిష్కరించుకోవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జోన్ కార్యదర్శి వెంకటలక్ష్మి, రజని, సిఐటియు నాయకులు అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

విహారికి రావిశాస్త్రి పురస్కారం

ప్రజాశక్తి-సీతమ్మధార : రావిశాస్త్రి లిటరరీ ట్రస్ట్, విశాఖ రసజ్ఞ వేదిక సంయుక్తంగా ఏటా నిర్వహిస్తున్న ప్రముఖ రచయిత రావిశాస్త్రి స్మారక పురస్కారం ఈ ఏడాది ప్రసిద్ధ కథా రచయిత, కవి విమర్శకుడు విహారికి ప్రదానం చేయనున్నట్లు ట్రస్టు వ్యవస్థాపకులు డాక్టర్ రాచకొండ నరసింహశర్మ, రసజ్ఞ వేదిక అధ్యక్షులు డాక్టర్ గండికోట రఘు రామారావు ప్రకటించారు. రావిశాస్త్రి జయంతి సందర్భంగా ఈ నెల 30న విశాఖ పౌర గ్రంథాలయంలో నిర్వహించే సభలో పురస్కార ప్రదానం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కవులు, రచయితలు పాల్గొంటారని పేర్కొన్నారు.

21న ఎంప్లాయి గ్రీవెన్స్ డే

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జిల్లాలో ఈ నెల 21న కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఉదయం 9 గంటల నుంచి 10.30 వరకూ ఎంప్లాయి గ్రీవెన్స్ డే కార్యక్రమం ఉంటుందని విశాఖ జిల్లా కలెక్టర్ ఎ.మల్లికార్జున తెలిపారు. ఈ మేరకు ఆయన సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. గతంలో పేర్కొన్న సమయం మార్పును ఉద్యోగులు గమనించాలని కోరారు. ఈ గ్రీవెన్స్‌లో ఉద్యోగులు వ్యక్తిగత ఫిర్యాదులతో సహా ఏ రకమైన ఫిర్యాదులనైనా జిల్లా కలెక్టర్/హెచ్ఒడిలకు సమర్పించవచ్చునన్నారు. అన్ని ఫిర్యాదులూ జగనన్నకు చెబుదాం పోర్టల్‌లో ప్రత్యేక ఐడిలతో నమోదు చేయబడతాయని తెలిపారు.

జర్నలిస్టుల పిల్లలకు ఉచిత విద్య కోసం వినతి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖ జిల్లాలో పని చేస్తున్న జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేట్ విద్యా సంస్థల్లో ఉచిత విద్య అందించాలంటూ తెలుగు జర్నలిస్ట్ ఫోరం అధ్యక్ష, కార్యదర్శులు పి.ఈశ్వర్ చౌదరి, బి.జార్జి ఫెర్నాండేజ్ సోమవారం విశాఖ కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జునకు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ చాలా మంది జర్నలిస్టులు తమ పిల్లలకు ఫీజులు కట్టలేని స్థితిలో ఉన్నారన్నారు. అనంతపురం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఆ జిల్లాలో ఉచిత విద్య అమలవుతోందని గుర్తు చేశారు. ఆ విధంగానే ఇక్కడా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు నందకుమార్, విశాఖ అధ్యక్షులు ఎల్‌జి.నాయుడు, ఉపాధ్యక్షులు సుంకర సూర్యం, వాజీ ఛానల్ బ్యూరో చీఫ్ పైడి బాలకృష్ణ పాల్గొన్నారు.

43వ వార్డులో గడపగడపకు మన ప్రభుత్వం

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి 43వ వార్డులో సోమవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. వార్డులోని ఎలమంచిలివారి వీధిలో కార్పొరేటర్ పెదిశెట్టి ఉషశ్రీ, ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా కెకె.రాజు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికి అందేలా చూడాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో 42వ వార్డు కార్పొరేటర్ లీలావతి, శ్రీనివాసరావు, జివిఎంసి అధికారులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.



సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందిస్తున్న కెకె.రాజు, ఉషశ్రీ తదితరులు

కెకె.రాజుకు శుభాకాంక్షలు

రాష్ట్ర నెడ్ క్యాప్ ఛైర్మన్‌గా కెకె.రాజు రెండేళ్ళ పూర్తిచేసుకున్న సందర్భంగా ఆయనకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు. 43వ వార్డు కార్పొరేటర్ పెద్దిశెట్టి ఉషశ్రీ ఆధ్వర్యాన నందగిరినగర్‌లోని పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కిరణ్‌రాజు, సీనియర్ నాయకులు షేక్ బాబ్జి, జక్కంపూడి సత్యనారాయణ, బైర వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి కమిషనర్ ఆదేశాల మేరకు 14వ వార్డులో సాయిబాబా గుడి ఎదురుగా ఫుట్ పాత్ ఆక్రమణలను తొలగించినట్లు ఇన్‌ఛార్జి టిపిఎస్ తేజ తెలిపారు. ఫుట్ పాత్‌లను ఎవరు ఆక్రమించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. గోడలపై పోస్టర్లు అంటించవద్దని, అతిక్రమిస్తే జరిమానా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జివిఎంసి అధికారులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల సమస్యలపై ధర్నా



కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న పారిశుధ్య కార్మికులు

ప్రజాశక్తి-అనకాపల్లి

జివిఎంసి అనకాపల్లి జోన్ పనిచేస్తున్న పారిశుధ్య కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం కలెక్టరేట్ ముందు సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జీవీఎంసీ ఎంప్లాయిస్ యూనియన్ అనకాపల్లి జోన్ గౌరవాధ్యక్షులు గంట శ్రీరామ్ మాట్లాడుతూ డెత్, రిటైర్మెంట్, లాంగ్ సిక్కు పోస్టులు వారసులతో భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. పర్మినెంట్, కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ కార్మికులకు సమ్మె సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. జివిఎంసిలో విలీనం చేయకముందు అనకాపల్లి మున్సిపాలిటీలో శానిటేషన్ వర్కర్స్ సుమారు 450 మంది ఉండేవారని, విలీనమైనా తరువాత జనాభా, పట్టణ విస్తరణ పెరిగాయని పేర్కొన్నారు. అందుకుతగ్గట్టుగా వర్కర్లను పెంచాల్సి ఉండగా, సిబ్బందిని తగ్గించడం బాధాకరమన్నారు. ప్రస్తుతం పర్మినెంట్ కార్మికులు 110 మంది, కాంట్రాక్ట్ కార్మికులు 100 మంది మాత్రమే పని చేస్తున్నారని, దీంతో వీరిపై పని భారం పెరిగిందని తెలిపారు. ప్రస్తుతం అనకాపల్లి జోనల్ పరిధిలో 250కి పైగా పోస్టులు ఖాళీగా ఉన్నాయని, వాటిని వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. జోనల్ పరిధిలో సుమారు 80 మంది వరకు డెత్, రిటైర్మెంట్, లాంగ్ సిక్కు అయిన వారు ఉన్నారని, ఆ పోస్టుల్లో వారి వారసులను నియమించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.శంకరరావు, నాయకులు ఎ.బాలకృష్ణ జి.సత్యనారాయణ, యూనియన్ నాయకులు వై.ఏసురాజు, బొమ్మల రాము, నిమ్మకాయల అజయ్, వాసు, నూకరాజు, బొమ్మల నాగరాజు , సత్యనారాయణ, గోవిందు, రమణమ్మ, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

రైవాడ నీటిని ఆయకట్టు రైతులకు ఇవ్వాలని..

రైవాడ రిజర్వాయర్ కుడి కాలువ నీటిని చోడవరం మండలంలోని ఏడు గ్రామాల ఆయకట్టు రైతులకు విడుదల చేయాలని కోరుతూ కలెక్టర్ కార్యాలయం ఎదుట రైతుకూలీ సంఘం ఆధ్వర్యంలో రైతులు ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి కోన మోహన్‌రావు మాట్లాడుతూ ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి, ఆయకట్టు రైతులకు సాగునీటిని అందించకపోతే రైతులు మరింతగా ఉద్యమిస్తారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు పైలా రమేష్, కిళ్లి దేముడు, మరిసా సతీష్, ఎస్.శివశంకర్, ఎస్.సత్యవతి, రైతులు పాల్గొన్నారు. ధర్నా అనంతరం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు.

ఆన్లైన్ బెట్టింగ్, వివిధ యాప్‌లను నిషేధించాలని..

ఆన్లైన్ బెట్టింగ్, లివింగ్, ఫ్రెండ్ షిప్, వివిధ రకాల యాప్‌లను తక్షణమే నిషేధించాలని కోరుతూ అఖిలభారత యువజన సమాఖ్య ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముందు నిరసన తెలిపారు. అనంతరం కలెక్టర్ రవి పఠాన్‌శెట్టికి వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా సంఘం నాయకులు కన్నబాబు, వియ్యపు రాజు మాట్లాడుతూ ఆన్లైన్ యాప్‌ల వల్ల చాలామంది అమాయక ప్రజలు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు ఈశ్వరరావు, రమణ, అప్పలనాయుడు, కిషోర్ పాల్గొన్నారు.

కలెక్టరేట్ స్పందనకు 289 అర్జీలు

అనకాపల్లి : జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం, స్పందన కార్యక్రమానికి 289 అర్జీలు వచ్చాయి. వాటిని కలెక్టర్ రవి పఠాన్ శెట్టి, జాయింట్ కలెక్టర్ జాహ్నవి, డిఆర్‌ఓ వెంకట రమణ, డిఆర్‌డిఎ పీడీ ఎ.లక్ష్మీపతి, డ్వామా పీడీ సందీప్ కుమార్ స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్పందన కింద అందిన అర్జీల పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పని తీరులో నిర్లక్ష్యం చేసినా, కాలయాపన చేసినా, అవకతవకలకు పాల్పడినా చర్యలు తప్పవని హెచ్చరించారు. అర్జీదారులు సంతృప్తి చెందేలా పరిష్కారం రాకపోయినా, నిర్దేశించిన గడువులోగా ఇవ్వకపోయినా సంబంధిత అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.

ఎస్‌పి కార్యాలయంలో 40 ఫిర్యాదులు

సమస్యలను చట్టపరిధిలో సత్వరమే పరిష్కరించాలని జిల్లా ఎస్‌పి కేవీ మురళీకృష్ణ సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు. ఎస్పీ కార్యాలయంలో సోమవారం జరిగిన స్పందన కార్యక్రమానికి 40 ఫిర్యాదులు ఇచ్చాయి. వాటిని ఎస్‌పి స్వయంగా స్వీకరించి, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ (పరిపాలన) బి.విజయభాస్కర్, ఎస్ఐ వెంకన్న పాల్గొన్నారు.



వృద్ధురాలితో మాట్లాడుతున్న మంత్రి అమర్‌నాథ్

మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత

ప్రజాశక్తి-అనకాపల్లి : మౌలిక సదుపాయాల కల్పనకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ అన్నారు. మండలంలోని సిహెచ్ఎన్ అగ్రహారంలో ఎంపీపీ గొర్లె సూరిబాబు ఆధ్వర్యంలో సోమవారం జరిగిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంత్రి అమర్నాథ్ పాల్గొన్నారు. గ్రామంలో కాలువలు, రోడ్లు నిర్మించేందుకు నిధులు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు.



మాట్లాడుతున్న టిడిపి జిల్లా అధ్యక్షులు నాగజగదీశ్వరరావు

ఎమ్మెల్యే కన్నబాబురాజు తీరు మార్చుకోవాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం

ప్రజాశక్తి-అనకాపల్లి

యలమంచిలి ఎమ్మెల్యే కన్నబాబురాజు తన తీరు మార్చుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం సోమవారం ఒక ప్రకటనలో హితవుపలికారు. మునగపాక మండలం వెంకటాపురంలో శనివారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇప్పించాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చిన సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు గనిశెట్టి సత్యనారాయణపై ఆయన అసహనం వ్యక్తం చేయడం సరికాదని పేర్కొన్నారు. ప్రజల సమస్యలు పరిష్కరించకుండా వారి తరపున మాట్లాడిన నాయకులపై దురుసుగా ప్రవర్తిస్తే తన రాజకీయ భవిష్యత్‌కు నష్టమని ఎమ్మెల్యే గ్రహిస్తే మంచిదని హితవుపలికారు. వెంకటాపురంలో 94 మంది లబ్దిదారుల జాబితా ప్రకారం ఇళ్ల స్థలాలు అప్పగించాలని డిమాండ్ చేశారు. నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వకపోతే ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఎమ్మెల్యే తన తీరు మార్చుకొని, ప్రజల సమస్యల పట్ల సానుకూలంగా వ్యవహరించాలని కోరారు.

జగన్ పాలనలో విద్యా వ్యవస్థ తిరోగమనం

ప్రజాశక్తి-అనకాపల్లి

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన విద్యా విధానాన్ని రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం అమలు చేయడంతో విద్యావ్యవస్థ తిరోగమన దిశగా వెళుతుందని తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు బుద్ధ నాగ జగదీశ్వరరావు అన్నారు. స్థానిక టిడిపి పార్లమెంటరీ పార్టీ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అనకాపల్లి జిల్లాలో ఈ విద్యా సంవత్సరంలో గతం కంటే 15 వేల మంది విద్యార్థులు ప్రభుత్వ బడులకు దూరమయ్యారని తెలిపారు. 2021-22 విద్యా సంవత్సరం తర్వాత ప్రభుత్వ పాఠశాలలో ఏటా 4 లక్షల మంది విద్యార్థులు చొప్పున తగ్గిపోయారని, ఈ మూడేళ్లలో 11 లక్షలు మంది విద్యార్థులు ప్రైవేటు పాఠశాలలకు తరలిపోయారని తెలిపారు. 3, 4, 5 తరగతులను ఉన్నత పాఠశాలల్లో విలీనం చేయడంతో ప్రాథమిక పాఠశాలలో 1, 2, తరగతుల విద్యార్థుల సంఖ్య 20 లోపు ఉందని, దీంతో ఏకో ఉపాధ్యాయుల వల్ల విద్యా ప్రమాణాలు తగ్గుతున్నాయని పేర్కొన్నారు. గతంలో విద్యార్థుల సంఖ్యను బట్టి ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ పోస్టులను కేటాయించగా, ఇప్పుడు సెక్షన్ వారీగా పెట్టి ఉపాధ్యాయులను తగ్గించి వేయడం జరుగుతుందని, 98 మంది కంటే తక్కువ విద్యార్థులున్న పాఠశాలలకు స్కూల్ అసిస్టెంట్ పోస్టులను రద్దు చేశారని తెలిపారు. వీటిపై జగన్ రెడ్డి ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. విలేకరుల సమావేశంలో టిడిపి నాయకులు మాదంశెట్టి నీలబాబు, మాజీ కౌన్సిలర్ కుప్పిలి జగన్ పాల్గొన్నారు.

ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం

ప్రజాశక్తి-అనకాపల్లి : హాస్పిటల్ కమిటీ ఛైర్మన్, 84వ డివిజన్ కార్పొరేటర్ మాదంశెట్టి చిన్నతల్లి నీలబాబు ఆధ్వర్యంలో సిరసపల్లి ఆరోగ్య కేంద్రంలో సోమవారం హాస్పిటల్ అభివృద్ధి కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో చినతల్లి నీలబాబు మాట్లాడుతూ పిహెచ్సి హాస్పిటల్‌లో 66 రకాలు వైద్య పరీక్షలు ఉచితంగా అందిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ ఆస్పత్రికి వైద్యం కోసం వచ్చే వారందరూ పేదవారని, అటువంటివారిని ప్రేమగా ఆదరించి వారికి మెరుగైన చికిత్సలు, మందులు సరఫరా చేయాలని సిబ్బందికి సూచించారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయ సభ్యులు, పిహెచ్సి డాక్టర్లు, తెలుగుదేశం పార్టీ నాయకులు సిరసపల్లి సన్యాసిరావు, కసిరెడ్డి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న ఉప ముఖ్యమంత్రులు రాజన్నదొర, బూడి ముత్యాలనాయుడు, కలెక్టర్, జెసి, అధికారులు

గ్రామ స్వరాజ్య స్థాపన దిశగా సమీక్షలు

జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి రాజన్న దొర

ప్రజాశక్తి-అనకాపల్లి

రాష్ట్ర ప్రభుత్వం ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో అభివృద్ధి కమిటీ సమావేశాలు నిర్వహించి గ్రామ స్వరాజ్య స్థాపన దిశగా సుపరిపాలనపై దృష్టి సారించినట్లు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, ఉపముఖ్యమంత్రి రాజన్న దొర పేర్కొన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం మాడుగుల నియోజకవర్గ అభివృద్ధి కమిటీ సమావేశం జరిగింది. జిల్లా స్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఆదేశం మేరకు నియోజకవర్గ అభివృద్ధి కమిటీ సమావేశాలు నిర్వహిస్తున్నామని, ఇకపై ప్రతీ సోమవారం ఒక నియోజకవర్గంపై సమీక్ష నిర్వహిస్తామని చెప్పారు. రాష్ట్రంలో ఉత్తమ స్థానంలో నియోజకవర్గాలు నిలిచేలా ప్రత్యేక చొరవ చూపాలని సూచించారు. నియోజకవర్గంలో ఉన్న సమస్యలన్నీ తమ వద్దకు తీసుకొస్తే తక్షణ పరిష్కారం చేయడానికి అన్ని విధాల ప్రయత్నిస్తామని అధికారులకు సూచించారు. ముఖ్యంగా రహదారుల మరమ్మతులకు ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రజలకు ఇబ్బందులుగా ఉండే రోడ్లను తక్షణమే రిపేరు చేసి, అవసరమైన నిధులకు ప్రతిపాదనలు పంపించి వాటికి అనుమతులు వచ్చేలా ప్రత్యేక చొరవ తీసుకోవాలని అర్ అండ్ బి అధికారులను ఆదేశించారు. మరో ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు మాట్లాడుతూ తమ నియోజకవర్గంలో గల వడ్డాది-మాడుగుల, వడ్డాది-పాడేరు రోడ్డు బాగోక పోవడం వలన ప్రజలు చాలా ఇబ్బంది పడుతున్నారని, దాన్ని తక్షణమే బాగు చేయుటకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అంగన్వాడీ సెంటర్లు, జగనన్న ఇళ్లపై సమీక్షించారు. విశాఖపట్నం నుంచి ఇరిగేషన్ డివిజనల్ ఆఫీసు నర్సీపట్నానికి తరలిస్తూ గవర్నమెంట్ ఆదేశాలు ఇచ్చిందని దానిపై తక్షణమే డివిజనల్ కార్యాలయాన్ని నర్సీపట్నంలో ఏర్పాటు అక్కడ నుండే విధులు నిర్వర్తించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో కలెక్టర్ రవి పఠాన్ శెట్టి, జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం జాహ్నవి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో సత్తా

ప్రజాశక్తి-చోడవరం

ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీల్లో చోడవరం, అనకాపల్లికి చెందిన విద్యార్థులు బంగారు, రజత పతకాలు సాధించారని ఉమ్మడి విశాఖ జిల్లా తైక్వాండో అసోసియేషన్ ఉపాధ్యక్షులు పళ్ళ మురళీకృష్ణ తెలిపారు. ఈ నెల 15, 16 తేదీలలో విజయనగరం, రాజీవ్ ఇండోర్ స్టేడియంలో జరిగిన 6వ కాడెట్ క్యోరుగి, పూమ్ సే ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలలో చోడవరం, అనకాపల్లికి చెందిన విద్యార్థులు 1గోల్డ్ మెడల్, 9 సిల్వర్, ఒకటి బ్రాంజ్ మెడల్ సాధించారన్నారు. అనకాపల్లికి చెందిన డిఎస్ఎస్ అంజని ప్రియ అండర్ 75 కెజీల విభాగంలో డిఎస్ఎస్ అంజని ప్రియ బంగారు పతకం సాధించింది. గ్రూప్ పూమ్ సే బాలుర డివిజన్‌లో బొబ్బిలి సత్య రామచంద్ర, గండి కారుణ్య సందీప్, సోనారి తన్న, గ్రూప్ పూమ్ సే బాలిక విభాగంలో వి జెస్సిక రోజీలి, ఎం.హేమాక్షి, డిఎస్-ఎస్ అంజని ప్రియ, ఇండివిజిల్ పూమ్ సేవలో గండి కారుణ్య సందీప్, పెయిర్ పూమ్ సేలో బి.దినేష్, డిఎస్ఎస్ అంజని ప్రియ రజత పతకాలు సాధించారని తెలిపారు. క్యోరుగి అండర్ 45 కేజీల విభాగంలో జివి శశివర్ధన్ కాంస్య సాధించాడు. పతకాలు సాధించిన క్రీడాకారులను ఈ నెల 28, 29 తేదీలలో ఉత్తర ప్రదేశ్‌లో జరగబోయే జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు.



రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీల్లో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు


కార్యక్రమంలో పాల్గొన్న జెడ్‌పిటిసి రాంబాబు

తాగునీటి బోరు ఏర్పాటుకు భూమి పూజ

ప్రజాశక్తి - బుచ్చయ్యపేట : మండలంలోని పోలేపల్లి గ్రామంలో మరిడి మాంబ గుడి వద్ద మండల పరిషత్ నిధులతో తాగునీటి బోరు ఏర్పాటుకు సోమవారం జెడ్పీటీసీ దొండా రాంబాబు భూమి పూజ చేసి బోరు తవ్వకం పనులు ప్రారంభించారు. అనంతరం స్థానిక నాయకులు రాంబాబును సాలువాతో సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ సీతా పైడినాయుడు, ఎంపీటీసీ సీతా వరలక్ష్మి సన్యాసినాయుడు, సచివాలయ కన్వీనర్ కసిరెడ్డి కృష్ణ, స్కూల్ కమిటీ చైర్మన్ పఠ్రె శివ, తుంపాల అప్పారావు, మల్లోతు ముత్యాలనాయుడు, సీతా సంతోష్ కుమార్, సీతా నాగేశ్వరరావు, సీతా అప్పలనాయుడు, తుంపాల అప్పారావు పాల్గొన్నారు.

నూకాంబికను దర్శించుకున్న పీలా

ప్రజాశక్తి-అనకాపల్లి : నూకంబికా అమ్మవారిని మాజీ శాసనసభ్యులు పీలా గోవింద సత్యనారాయణ సోమవారం దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆయన వెంట టిడిపి నాయకులు మళ్ళ సురేంద్ర, బిఎస్ఎంకె జోగినాయుడు, పోలారపు త్రినాథ్, తలారి కాశీ నాయుడు, సురే సతీశ్ కుమార్, పిట్ల రాజు, కరణం రమణ, ఆకుల నానాజీ, మణికంఠ, నాయుడు, ఆళ్ల జగన్, యల్లపు శ్రీను పాల్గొన్నారు.

'గీతాంజలి'లో గోరింటాకు ఉత్సవం

ప్రజాశక్తి - యలమంచిలి : ఆషాఢ మాసం పురస్కరించుకొని గీతాంజలి కళాశాలలో సోమవారం గోరింటాకు ఉత్సవం నిర్వహించినట్లు కళాశాల కల్చరల్ కమిటీ కన్వీనర్ సి.హెచ్.లక్ష్మి విలేకర్లకు తెలిపారు. కార్యక్రమంలో కెమిస్ట్రీ అధ్యాపకురాలు మాట్లాడుతూ ఆషాఢమాసం ప్రాముఖ్యతను వివరిస్తూ చర్మవ్యాధులను దూరం చేసే గోరింటాకు పెట్టుకొనే సాంప్రదాయం కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో విద్యార్థినులు పెట్టుకొన్న వివిధ రకాల గోరింట్ల డిజైన్లు ప్రదర్శించారు. భౌతిక శాస్త్ర అధ్యాపకురాలు శ్రావణి, మాథ్స్ లెక్చరర్ ఇంద్రజ, సిబ్బంది స్వాతి, విద్యార్థి సంఘాల ప్రతినిధులు బోదెపు సాయి, శిరీష, ఉమా, రాశి, శోభలత పాల్గొన్నారు.

చెరుకు రైతుల సమస్యలపై 20న ధర్నా

ప్రజాశక్తి- కె.కోటపాడు : చెరుకు రైతుల సమస్యలపై ఈనెల 20న గోవాడ సుగర్ ఫ్యాక్టరీ వద్ద జరుగు ధర్నాకు రైతులంతా తరలిరావాలని రైతు సంఘం నాయకులు వనము సూర్యనారాయణ పిలుపునిచ్చారు. గోవాడ సుగర్స్ రైతులకు బకాయి పేమెంట్లు చెల్లించాలని, చెరకుకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. గతంలో చెరకు రైతులకు వడ్డీ లేకుండా సబ్సిడీపై ఎరువులు పురుగు మందులు సరఫరా చేసేవారని, ప్రస్తుతం సబ్సిడీ తొలగించారని పేర్కొన్నారు. గతంలో ఏ విధంగా చేసేవారో అదే పద్ధతిలో కాంప్లెక్స్ ఎరువులు అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి ఎర్ర దేవుడు పాల్గొన్నారు.

విత్తన శుద్ధిపై రైతులకు అవగాహన

ప్రజాశక్తి-చోడవరం : ప్రకృతి వ్యవసాయంలో భాగంగా బీజామృతంతో విత్తన శుద్ధిపై జిల్లా అడిషనల్ డిఆర్పి ఆర్‌వి.స్వామి నాయుడు మండలంలోని భోగాపురం, పిఎస్ పేట, దామినోపల్లి గ్రామాల్లో సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజామృతంతో శుద్ధి చేస్తే పంటలకు ఎటువంటి తెగుళ్ళు రాకుండా కాపాడుతుందన్నారు. దీనివల్ల విత్తనం 100శాతం మొలకెత్తుతుందని చెప్పారు. భూమి నుండి విత్తనం నుండి వచ్చే తెగుళ్ల పంట ఆరోగ్యంగా పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో రైతులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు

నేడు టిడిపి కార్యకర్తలకు శిక్షణ

ప్రజాశక్తి-పరవాడ : తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు మంగళవారం సాయంత్రం 4 గంటలకు సుజాతనగర్‌లోని ఇంద్రాణి కల్యాణ మండపంలో శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు టిడిపి మండల అధ్యక్షులు వియ్యపు చిన్న సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ రాష్ట్ర టెక్నికల్ టీం ద్వారా సమన్వయ కమిటీ సభ్యులకు, క్లస్టర్ ఇన్‌ఛార్జులు, యూనిట్ ఇన్‌ఛార్జులు, బూత్ ఇన్‌ఛార్జులకు ట్రైనింగ్ క్యాంపు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. బండారు సత్యనారాయణ మూర్తి అధ్యక్షతన జరిగే శిక్షణకు హాజరుకావాలని కోరారు.

తహశీల్దార్ మోకాలడ్డు

దేవాదాయశాఖ అధికారులకు సహకరించని వైనంపై విమర్శలు

ప్రజాశక్తి -దేవరాపల్లి

మండలంలోని మారేపల్లి రెవెన్యూ సర్వే 115లో కోట్లాది రూపాయలు విలువ చేసే 23 ఎకరాల 15 సెంట్లు ఆక్రమిత దేవుని మాన్యం భూమిలో బోర్డులు ఏర్పాటు చేయడానికి మండల రెవెన్యూ అధికారులు సహకరించడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. రాష్ట్ర కమిషనరేట్ నుండి వచ్చిన ఆదేశాలు మేరకు అనకాపల్లి జిల్లా అసిస్టెంటు కమిషనర్ సింగిల్ ట్రస్ట్ ఆఫీసరును నియమించి వెంటనే ఆక్రమణకు గురైన భూమికి బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశాలు ఇచ్చారు. దీంతో ఈనెల 17వ తేదీన బోర్డులు ఏర్పాటుకు రెవెన్యూ అధికారులు, పోలీసులు సహకారం కోరుతూ ఇండోమెంటు ఇన్‌స్పెక్టర్ ఈ నెల 14వ తేదీ దరఖాస్తు పెట్టారు. అయితే 17వ తేదీన రెవెన్యూ అధికారులు గైర్హాజరు కావడంతో ఇది మళ్లీ 19వ తేదీ నాటికి వాయిదా పడింది. ఈ రోజు కింది స్థాయి సిబ్బందినైనా పంపించాలని రైవాడలో జరిగిన జగనన్న సురక్షలో ఉన్న తహశీల్దార్‌ను కలిసి మరో దరఖాస్తు పెట్టారు. తహశీల్దార్ మాత్రం 'మాకు ఖాళీ ఉన్నప్పుడు కబురు చేస్తాం, మీరు వెళ్ళండి అని ఒక సారి, మీ భూమికి మేమెందుకని అని మరోసారి, అసలు మేమెందుకు రావాలని ఇంకోసారి ఇలా ఇండోమెంటు ఇన్‌స్పెక్టర్‌ను ముప్పుతిప్పలు పెట్టి పంపించేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. నిజానికి ఈ భూములకు సంబంధించి సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు దేవాదాయశాఖ అధికారుల చుట్టు కాళ్ళు అరిగేటట్లు తిరిగారు. ఎట్టకేలకు దీనిపై స్పందించిన దేవాదాయశాఖ అధికారులు ఆక్రమిత భూములు స్వాధీనానికి సిద్ధపడితే రెవెన్యూ అధికారులు సహకరించడం లేదు. రెవెన్యూ అధికారులు రియల్ ఎస్టేట్ వ్యాపారికి కొమ్ముకాస్తు బోర్డులు పెట్టడానికి మోకాళ్ళు అడ్డు పెడుతున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే ఈ భూములకు సంబంధించి దేవాదాయశాఖ అధికారులు పాస్ పుస్తకాలు కావాలని, 22ఎ 1సిలో చేర్చాలని రెవెన్యూ అధికారులను కోరారు. దానికి రెవెన్యూ అధికారులు స్పందించలేదు. గతంలో ఉన్న తహశీల్దార్ మూడుసార్లు రియల్ ఎస్టేట్ వ్యాపారికి పాస్ బుక్కులు తిరస్కరిండం జరిగింది. ప్రస్తుత తహశీల్దార్ కబ్జాదారులకు కొమ్ముకాయాలనుకోవడం విచారకరమని, వెంటనే దేవాదాయశాఖ అధికారులకు సహకరించి బోర్డులు ఏర్పాటు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు డి వెంకన్న డిమాండ్ చేశారు.

సీజనల్ వ్యాధుల నివారణకు చర్యలు

ప్రజాశక్తి - యలమంచిలి

వేడి గాలులు అనంతరం ఇటీవల కురిసిన వర్షాలకు కొన్ని చోట్ల ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని, సీజనల్‌గా వచ్చే వైరల్ ఫీవర్, మలేరియా, డెంగీ మొదలైన ఆరోగ్య సమస్యలకు ఆదిలోనే అంతమొందించేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నామని యలమంచిలి 50 పడకల ఆసుపత్రి సూపరింటెండెంట్ జి.జనార్ధన్ అన్నారు. సోమవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ తాను ఇక్కడకొచ్చి మూడు వారాలే అయినప్పటికీ పరిస్థితులన్నీ ఆకలింపు చేసుకుంటున్నట్లు చెప్పారు. తొలకరి మొదలవడంతో దోమల ఉధృతి పెరిగి వాటి బారిన పడుతున్న జ్వర పీడితులు సంఖ్య పెరిగిందన్నారు. అయినా ఆసుపత్రిలో మందులు కొరత లేదన్నారు. డెంగీ, మలేరియా కేసులు రాకుండా ముందస్తు అవగాహనా శిబిరాలు ఏర్పాటు చేశామన్నారు. దోమల నివారణకు మున్సిపాలిటీ ఫాగింగ్ కార్యక్రమం చేపట్టిందని చెప్పారు. ఇక్కడ ప్రధానంగా డాక్టర్ల కొరత ఉందని, ఉన్న 9 మంది వైద్యుల్లో ముగ్గురు సెలవులో ఉన్నారని, ఒకరు డిప్యుటేషన్, మరొక డాక్టరు మెటర్నిటీ లీవులోనూ ఉన్నారని తెలిపారు. దీంతో పని ఒత్తిడి పెరిగిందని పేర్కొన్నారు. 50 పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేశారే తప్ప ఇక్కడ సౌకర్యాలేమీ పెరగలేదన్నారు. కొత్తగా వచ్చిన డెంటల్ డాక్టర్ పద్మ మాట్లాడుతూ ఇప్పటికీ దంత చికిత్సకు కావలసిన పూర్తి సౌకర్యాలు ఆసుపత్రిలో లేవని, కొన్ని పరికరాలు రావలసి ఉందని తెలిపారు.


మాట్లాడుతున్న 50 పడకల ఆసుపత్రి సూపరింటెండెంట్ జనార్ధన్


మాట్లాడుతున్న జిల్లా శిక్షణ సంస్థ వైస్ ప్రిన్సిపల్ రవి

వ్యాయామ ఉపాధ్యాయులకు శిక్షణ

ప్రజాశక్తి-కశింకోట : స్థానిక సెయింట్ జాన్స్ పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమం సోమవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా జిల్లా విద్యా శిక్షణ సంస్థ వైస్ ప్రిన్సిపాల్ గొట్టేటి రవి మాట్లాడుతూ మ్యాజిక్ బస్సు ఒప్పందం వల్ల రానున్న మూడేళ్లలో ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులు అధునాతన జీవన నైపుణ్యాలు పెంపొందుతాయని తెలిపారు. జిల్లాలో 50 పాఠశాలలకు చెందిన ఒక ఫిజికల్ డైరెక్టర్‌కు, ఒక చురుకైన ఉపాధ్యాయునకు డైట్ ఆధ్వర్యంలో ఈ మూడు రోజుల శిక్షణ జరుగుతుందని చెప్పారు. సెయింట్ జాన్స్ పాఠశాల ప్రిన్సిపాల్ రూప మాట్లాడుతూ విద్యార్థుల్లో జీవన నైపుణ్యాలను ప్రేరేపించగలవారు ఉపాధ్యాయులేనని తెలిపారు. పాఠశాల స్థాయిలో మ్యాజిక్ బస్సు వాలంటీర్ల సహకారంతో అమలు చేయవలసి ఉంటుందన్నారు. కార్యక్రమంలో మ్యాజిక్ బస్సు అనకాపల్లి జిల్లా కోఆర్డినేటర్ అశోక్ కుమార్ రాజు, రిసోర్స్ పర్సన్ జె.మాధవి, జిల్లా గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి ఎ.శేఖర్, పిఇటి సంఘం కార్యదర్శి కిరణ్ పాల్గొన్నారు.

అమర్‌నాథ్ గౌడ్ కుటుంబానికి న్యాయం చేయాలి

ప్రజాశక్తి- అనకాపల్లి : బాపట్ల జిల్లా ఉప్పల వారిపాలెంలో అధికారపార్టీ రౌడీ మూకలు అత్యంత పాశవికంగా పెట్రోల్ పోసి కాల్చి చంపిన అమరనాథ్ గౌడ్ కుటుంబానికి న్యాయం చేయాలని టిడిపి బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.నీలబాబు, జిల్లా అధ్యక్షులు గింజల లక్ష్మణరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు పార్లమెంటరీ పార్టీ కార్యాలయంలో అమర్నాథ్ గౌడ్ చిత్రపటం దగ్గర సోమవారం నిరసన వ్యక్తం చేశారు. బాధితులకు నెల రోజుల్లో న్యాయం చేస్తామని చెప్పిన ప్రభుత్వం నేటికీ నిందితులపై చర్యలు తీసుకోలేదన్నారు. జగన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత బీసీలపై వేధింపులు పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. బీసీ సెల్ నాయకులు భీమరశెట్టి శ్రీనివాసరావు, కసిరెడ్డి ప్రసాద్, దాడి ముసలి అప్పారావు, ఏపిఎం సత్యనారాయణ, ఆడారి జనార్ధన్ రావు, మళ్ల శేషు, బుద్ధ భువనేశ్వర్రావు, కుప్పిలి జగన్ పాల్గొన్నారు.

ఓటరు వెరిఫికేషన్ విధిగా నిర్వహించాలి

ప్రజాశక్తి- కశింకోట : టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు నిర్దేశించిన ఓటరు వెరిఫికేషన్ కార్యక్రమాన్ని ప్రతి గ్రామంలోనూ కార్యకర్తలు విధిగా నిర్వహించాలని తెలుగు రైతు జిల్లా ప్రధాన కార్యదర్శి ఉగ్గిన రమణమూర్తి పిలుపునిచ్చారు మండలంలోని కొత్తపల్లి బుచ్చెయ్యపేట, తాళ్ళపాలెం, ఉగ్గిన పాలెం, జమాదుల పాలెం, బయ్యవరం గ్రామంలో జరిగిన ఓటరు వెరిఫికేషన్‌పై రమణమూర్తి కార్యకర్తలతో మాట్లాడారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బుదిరెడ్డి గంగయ్య, చెంబకాయల శ్రీను, మొల్లి రమణ, మోటూరి వెంకటేష్ పాల్గొన్నారు.

పాఠశాల విద్యార్థినులకు కంటి పరీక్షలు

ప్రజాశక్తి-చోడవరం : చోడవరం ప్రభుత్వ బాలికల పాఠశాలలో సోమవారం వైయస్సార్ కంటి వెలుగు ఆధ్వర్యంలో వైద్యులు విద్యార్థినులకు కంటి పరీక్షలు నిర్వహించారు. 550 మంది విద్యార్థినులకు కంటి పరీక్షలు నిర్వహించి వారిలో 89 మందికి కళ్లద్దాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కంటి వైద్యులు కె శ్రీనివాసరావు, స్థానిక ప్రధానోపాధ్యాయులతో పాటు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

డిఆర్‌డిఎ ద్వారా మొక్కల పంపిణీ


మొక్కలు పంపిణీ చేస్తున్న ఎంపిపి తదితరులు

ప్రజాశక్తి - పరవాడ : డిఆర్‌డిఎ ఆధ్వర్యాన వైయస్సార్ క్రాంతి పథం కార్యాలయం వద్ద సోమవారం వివిధ రకాల మొక్కలు పంపిణీ చేశారు. వీటిని ఎంపీపీ పైల వెంకట పద్మలక్ష్మి శ్రీనివాసరావు చేతుల మీదగా 45 గ్రామ సంఘాలలో గల సంఘ సభ్యులకు 10 రకాలైన 4,250 పండ్ల మొక్కలను అందజేశారు. ఈకార్యక్రమంలో వైసిపి సీఈసీ సభ్యులు పైల శ్రీనివాసరావు, పరవాడ సర్పంచ్ సిరపర్ అప్పలనాయుడు, వైస్ ప్రెసిడెంట్ బండారు రామారావు, చుక్క రాము నాయుడు, మార్కెట్ సలహా కమిటీ చైర్మన్ కోన రామారావు, విపిఎమ్, సిసిఎస్, విఓఎస్, లబ్దిదారులు పాల్గొన్నారు.

సబ్సిడీపై మొక్కలు పంపిణీ

దేవరాపల్లి : మండలంలోని బోయిల కింతాడ గ్రామంలో సర్పంచ్ బూరె బాబూరావు ద్వారా మహిళలకు సబ్సిడీపై వివిధ రకాల పండ్ల మొక్కలను సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ మొక్కలు ద్వారా ప్రతి ఒక్కరు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని కోరారు. ఈ కార్యక్రమంలో వివోఏ జాజిమొగ్గల చిన్నమ్మలు, ద్వాక్రా మహిళలు, ప్రజలు పాల్గొన్నారు.


మొక్కలు పంపిణీ చేస్తున్న బోయిల కింతాడ సర్పంచ్ బాబురావు

బైక్ దొంగతనాలకు అడ్డుకట్ట వేయాలని వినతి

ప్రజాశక్తి-అనకాపల్లి : మోటార్ బైకుల దొంగతనాలకు అడ్డుకట్ట వేయాలని, డిస్మాంట్లింగ్ షాపులపై నిఘా పెట్టాలని, రికార్డ్స్ లేకుండా బైకులను కొనే వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో పట్టణ పోలీస్ స్టేషన్లో ఎస్సై సత్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. పట్టణంలో మోటార్ సైకిల్ దొంగతనాలు విపరీతంగా పెరిగిపోతున్నాయని, ఇంటి ముందు పెట్టిన బైకులను కూడా పట్టుకెళ్ళిపోతున్నారని తెలిపారు. సరైనా పార్కింగ్ స్థలం లేక రోడ్లపై పెట్టిన వాహనాలను దొంగలు అపహరిస్తున్నారని చెప్పారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో డాక్టర్ చిన్నియాదవ్, ఆళ్ల ప్రవీణ్ కుమార్, బండి అప్పారావు, వాసుపల్లి తాతయ్యలు, మగడా అప్పారావు, బొడ్డు సోమరాజు, షేక్ మదీనా బాషా, బొడ్డు పరమేశ్వరరావు ఉన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

-పలు చోట్ల జగనన్న సురక్ష

ప్రజాశక్తి- యంత్రాంగం

జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా పలువురు లబ్ధిదారులకు వివిధ రకాల ధ్రువపత్రాలను అధికారులు అందజేశారు. అనకాపల్లి, విశాఖ జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో ఈ కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.

నక్కపల్లి:ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పాలన సాగిస్తుందని ఎమ్మెల్యే గొల్ల బాబురావు తెలిపారు. సోమవారం నక్కపల్లి సచివాలయం వద్ద జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. మండలంలోని ఇళ్ల స్థలాలు లేక ఎంతో మంది ఇబ్బందులు పడుతున్నారని, వారందరికి ఇళ్ల స్థలాలు ఇచ్చి పట్టాలు ఇవ్వాలని కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ అర్హత గల ప్రతి ఒకరికి ఇళ్ల స్థలాలు ఇవ్వడానికి తహశీల్దార్, గృహ నిర్మాణ శాఖ అధికారులు చర్యలు తీసు కోవాలని ఆదేశించారు. దోసలపాడులో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ అంబేద్కర్, ఎంపీడీవో సీతారామరాజు, ఈఓపిఆర్డీ వెంకట నారాయణ, ఎంపీపీ రత్నం, జడ్పీటీసీ గోసల కాసులమ్మ, సర్పంచ్ జయ రత్నకుమారి, వైస్ ఎంపీపీలు నానజీ, ఈశ్వరరావు, నాయకులు పొడగట్ల పాపారావు, మణిరాజు పాన్నారు.

కోటవురట్ల: ౖ జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే గొల్ల బాబురావు సోమవారం సుంకపూరు గ్రామంలో పాల్గొన్నారు. సుంకపూరు సచివాలయ పరిధిలో ధృవత్రాలను అందజేయగా గ్రామంలో కొంతమంది మహిళలు ఎమ్మెల్యేకు కాలనీ నిర్మాణ లబ్ధిదారులు పలు సమస్యలు విన్నవించారు. ప్రస్తుతం నిర్మిస్తున్న కాలనీ వద్ద రోడ్డు లేదని తీవ్ర అవస్థలు పడుతున్నామని లబ్ధిదారులు మఠం నాగమణి, దమ్ము రాజులమ్మ విన్నవించారు. ఎన్టీఆర్ కాలనీ బిల్లులు చెల్లించలేదని స్పష్టం చేశారు.


ఎమ్మెల్యేకు సమస్యలు విన్నవిస్తున్న మహిళలు

బోడపాలెం గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ డివి సూర్యనారాయణ రాజు పాల్గొన్నారు. ఎంపీడీవో కాశీ విశ్వనాథరావు, తహసిల్దారు జానకమ్మ, వైస్ ఎంపీపీ దత్తుడు రాజు, సుంకపూరు సర్పంచ్ కాశీ లక్ష్మి, సర్పంచ్ ఎరుకు నాయుడు పాల్గొన్నారు.

గొలుగొండ:మండలంలోని కొత్తమల్లంపేట గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఎంపిపి గజ్జలపు మణికుమారి చేతుల మీదుగా 610 మందికి ధృవపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఆనంద్, సర్పంచ్ పోలిరెడ్డి రాజబాబు, ఎంపిటిసి బొడ్డు సీత, నాయకులు బొడ్డు ఎర్రినాయుడు పాల్గొన్నారు. చీడిగుమ్మలలో 500 ధృవపత్రాలను జెడ్పీటీసీ సుర్ల గిరిబాబు అందజేశారు. ఎంపిడిఒ డేవిడ్‌రాజు, ఎంపిటిసి అప్పలనాయుడు, సర్పంచ్ చిన్నబ్బాయి పాల్గొన్నారు.

నర్సీపట్నం టౌన్: వేములపూడి గ్రామంలో జగనన్న సురక్షలో భాగంగా సర్టిఫికెట్లు, రేషన్ కార్డులు పంపిణీ చేశారు. ఎంపీపీ సుర్ల రాజేశ్వరి మాట్లాడుతూ, అర్హత ఉండి సంక్షేమ పథకాలు పొందలేని వారి కోసం జగనన్న సురక్ష కార్యక్రమం ఏర్పాటు చేశారన్నారు. ఆర్డిఓ జయరాం, ఎంపీడీవో జయ మాధవి పాల్గొన్నారు.

అనకాపల్లి:జిల్లాలోని పలు గ్రామాల్లో జగనన్న సురక్ష కార్యక్రమాలు నిర్వహించారు. అనకాపల్లి మండలం గోపాలపురం గ్రామంలో ఎంపీపీ గొర్లె సూరిబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో మంత్రి అమర్నాథ్ ముఖ్య అతిథిగా పాల్గొని దరఖాస్తుదారులకు ధ్రువపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్ కుమార్, సర్పంచ్ జెర్రిపోతుల లక్ష్మి పాల్గొన్నారు.

కశింకోట : మండలంలోని వెదురుపర్తి, త్యేగాడ గ్రామాల్లో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి రోజారాణి, జెడ్‌పిటిసి దంతులూరి శ్రీధర్ రాజు, ఎంపిపి కలగా లక్ష్మి పాల్గొని ధ్రువపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి పెంటకోట జ్యోతి, ఎమ్‌పిడిఓ రవికుమార్, సర్పంచ్‌లు కలగా గున్నయ్యనాయుడు, నీటిపల్లి ఈశ్వరమ్మ, నీటిపల్లి దివాకర్ పాల్గొన్నారు.

కె.కోటపాడు : మండలంలోని పింద్రంగి, మేడిచర్ల గ్రామాల్లో జగనన్న సురక్ష కార్యక్రమాల్లో ఎంపీపీ రెడ్డి జగన్మోహన్ పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమాల్లో లంకవానిపాలెం సర్పంచ్ వేచలపు దొరబాబు, ఎంపీడీవో శశిదేవి, తహశీల్దారు రమేష్ బాబు, మండల ప్రత్యేకాధికారి నాగలక్ష్మి, పింద్రంగి, మేడిచర్ల సర్పంచులు జాగరపు వెంకట మహాలక్ష్మి, పూడి నారాయణమూర్తి, ఎంపిటిసి రాజేష్ పాల్గొన్నారు.

దేవరాపల్లి : మండలంలోని రైవాడ, చింతలపూడి సచివాలయాల్లో సోమవారం జగనన్న సురక్ష గ్రామసభల్లో ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి భాస్కరరావు పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమాల్లో తహశీల్దార్ ఎం.లక్ష్మి, ఎంపీడీవో సిహెచ్.సుబ్బలక్ష్మి, మండల జెఎస్‌సి కన్వీనర్ కెవి.రమణ, ఈవోపిఆర్డి జిఎస్ నళిని, వైసిపి నాయకులు బూరె బాబురావు, వైస్ ఎంపీపీ ఉగ్రోకుల గంగాభవాని, రైవాడ, చింతలపూడి, తామరబ్బ సర్పంచులు చల్లా లక్ష్మీ నాయుడు, దొమ్మంగి బోడెమ్మ, టోకూరు రామకృష్ణ పాల్గొన్నారు.

ఆరిలోవ : జివిఎంసి 12వ వార్డు పరిధి సంతపాలెం సామాజిక భవనంలో వార్డు కార్పొరేటర్ అక్కరమాని రోహిణి ఆధ్వర్యాన జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. జోనల్ కమిషనర్ కనకమహాలక్ష్మి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో విఎంఆర్‌డిఎ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల పాల్గొని 1703 మంది లబ్ధిదారులకు వివిధ రకాల ధ్రువపత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు సత్తి మందారెడ్డి, కన్నేటి సుబ్బారెడ్డి, పిఐ.బాలరాజు, సూర్యారావు, హుస్సేన్ పాల్గొన్నారు.

సీతమ్మధార : జివిఎంసి 48వ వార్డు పరిధి ఊర్వశి జంక్షన్‌లోని స్టీల్ సిటీ పబ్లిక్ స్కూల్ ఆవరణలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె రాజు లబ్ధిదారులకు సంబంధిత సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో 48వ వార్డు వైసిపి ఇన్‌ఛార్జి నీలి రవి, ఎఇ అర్చన, జెసిఎస్ మండల కన్వీనర్ అమర్ రెడ్డి, నాయకులు కర్రి రామారెడ్డి, వసంతల అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఆనందపురం: మండలంలోని తర్లువాడ, పాలవలసలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఆధ్వర్యాన జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ లోకవరపు రామారావు, ఎంపిడిఒ లవ రాజు, ఎంపిపి మజ్జి శారదాప్రియాంక, జడ్‌పిటిసి కోరాడ వెంకటరావు, తర్లువాడ సర్పంచ్ బిఆర్‌బి.నాయుడు, పాలవల సర్పంచ్ అచ్చియ్యమ్మ, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న తహశీల్దార్ అంబేద్కర్

ఈ - పంట నమోదు చేసుకోవాలి

ప్రజాశక్తి -నక్కపల్లి:రైతులకు వ్యవసాయ పథకాలు వర్తించాలంటే ఈ పంట తప్పనిసరి అని తహసిల్దార్ అంబేద్కర్ సూచించారు. సోమవారం తహసిల్దార్ కార్యాలయంలో వ్యవసాయ అధికారి ఉమా ప్రసాద్ ఆధ్వర్యంలో వీఆర్వోలు, ఆర్బికే సిబ్బందితో సమావేశం నిర్వహించారు. రైతులకు వ్యవసాయ శాఖ పథకాలు, సున్నా వడ్డీ పంట రుణాలు, వైఎస్సార్ ఉచిత పంటల భీమా, రైతు భరోసా, ఇన్‌పుట్ సబ్సిడీ అందాలన్నా ఈ పంట నమోదు తప్పనిసరన్నారు. రైతులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గణాంక అధికారిణి రమణి పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-మాడుగుల:విశ్రాంత ఉద్యోగుల సమస్యలు ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఏ పిఎస్ ఆర్‌టిసి రిటైర్డ్ ఎంప్లాయీస్ యూనియన్ (సి ఐటియు) జిల్లా ప్రధాన కార్యదర్శి కే.కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. మాడుగుల దేవి ఆడిటో రియం వద్ద జరిగిన జిల్లా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, 2020, 2021, 2022 సంవత్సరాలలో పదవీ విరమణ చేసిన వారికి సెటిల్ మెంట్ చేయాలని, పిఎఫ్ కేసులు తక్షణం పరిష్కరించాలన్నారు. అన్ని రకాల మందులు సరఫరా చేసి, మెడికల్ స్కీములు కలిగిన వారికి అన్ని వైద్య సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. బస్ పాస్ సౌకర్యం ఎక్స్ ప్రెస్ బస్ లకు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు రాజారావు, సంయుక్త కార్యదర్శి తులసిరాం, వాసు దేవ రావు, రామ్మూర్తి, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ప్రధాన కార్యదర్శి


మోదకొండమ్మకు పూజలు చేస్తున్న ఎంవిఆర్

మోదకొండమ్మ సన్నిధిలో ఎంవిఆర్

ప్రజాశక్తి-మాడుగుల:ప్రముఖ పారిశ్రామిక వేత్త అనకాపల్లికి చెందిన ముత్యాల వెంకటేశ్వరరావును కే జే పురం గ్రామ దేవత మోదకొండమ్మ పండగలో ఘనంగా సన్మానించారు. ఆవారం రాత్రి జరిగిన ఈ కార్యక్రమంలో ఆయనకు స్వాగతం పలికి భారీ సన్మానం చేశారు. సాంస్కృతిక కార్యక్రమానికి అయన విరాళం అందించారు. ఈ కార్యక్రమంలో ఆయన కుమారుడు సతీష్‌తో పాటు, యువ సేన సభ్యులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం పంపిణీ

ప్రజాశక్తి -రావికమతం:కవగుంట పంచాయతీ శివారు బుడ్డిబంధ అంగన్వాడి కేంద్రంలో లబ్ధిదారులకు సంపూర్ణ పోషకాహారాన్ని సర్పంచ్ దాసరి సూర్యకుమారి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, గర్భిణీలు, బాలింతలు ఆరోగ్యవంతులుగా ఉన్నప్పుడే బిడ్డ కూడా ఆరోగ్యవంతులుగా ఉంటారని తెలిపారు. తల్లి పాలు కూడా బిడ్డలకు తాగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గృహ సారథి రోబ్బా వీరభద్రరాజు, అంగన్వాడీ కార్యకర్త రవణమ్మ, ఆశ లక్ష్మి, పలువురు పాల్గొన్నారు.

బహిరంగ సభను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్:స్థానిక ఎన్‌జిహెూమ్ లో ఏపి స్టేట్ కౌన్సిల్ ఆధ్వర్యంలో విధ దళిత సంఘాల ప్రతినిధులతో విదసం ఐక్యవేదిక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన ఐక్య వేదిక వ్యస్థాపకులు, ఏపి రాష్ట్ర కౌన్సిల్ కన్వీనర్ డాక్టర్ బూసి వెంకట్రావు మాట్లాడుతూ, త్వరలో నర్సీపట్నంలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తామన్నారు. అసైన్డ్ భూముల, యాజమాన్యపు హక్కులకు సంబంధించి ఎస్సీ, ఎస్టీలకు సంబంధించి 20 రకాల స్కీములను రాష్ట్ర ప్రభుత్వం తొలగించి దళితులకు అన్యాయం చేసిందని ఆయన విమర్శించారు. దళిత సంఘాల ఐక్యవేదిక ద్వారా దళితుల అందర్నీ ఒకే తాటిపైకి తీసుకొచ్చి హక్కుల కోసం పోరాటం చేస్తామన్నారు. ఈనెల 23న మధ్యాహ్నం 3.30 గంటలకు సభ ఉంటుందని అందరూ పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో దళిత, ఆదివాసీ, బిసి సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.


హాజరైన పలు సంఘాల ప్రతినిదులు

చెరుకు రైతులకు ఎరువుల పంపిణీ

- వ్యవసాయాధికారి విజయలక్ష్మి

ప్రజాశక్తి-రోలుగుంట:జిల్లా అధికారుల ఆదేశాల మేరకు గోవాడ సుగర్ ఫ్యాక్టరీ పరిధిలో ఉన్న రైతులకు రైతు భరోసా కేంద్రాల ద్వారా ఎరువులు పంపిణీ చేస్తున్నామని వ్యవసాయాధికారి ఎస్.విజయలక్ష్మి తెలిపారు. సోమవారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ, మండలంలో రోలుగుంట, జె.నాయుడుపాలెం గ్రామాల్లో చెరకు కాటాలు ఉన్నాయన్నారు. వీటిలో జె.నాయుడుపాలెం గ్రామంలో రైతులకు డిఎపి 10 టన్నులు, యూరియా 10 టన్నులు పంపిణీ చేయడం జరిగిందన్నారు. రోలుగుంట పరిధిలో ఉన్న రైతులకు కార్యాలయంలో డిఎపి 10 టన్నులు, యూరియా 12 టన్నులు ఎరువులు ఉన్నాయని తెలిపారు.రోలుగుంట చెరకు కాటా పరిధిలో ఉన్న రైతులు ఎరువులు తీసుకువెళ్లాలని ఆమె సూచించారు.



మొక్కలతో పర్యావరణ పరిరక్షణ

ప్రజాశక్తి -నక్కపల్లి:మొక్కలతో పర్యావరణ పరి రక్షించబడుతుందని పెదతీనార్ల ఎంపీటీసీ సభ్యులు మెరుగు నాగేశ్వరరావు అన్నారు. సోమవారం వెలుగు ఆధ్వర్యంలో డ్వాక్రా మహిళలకు వివిధ మొక్కలు సమకూర్చారు. ఈ మేరకు గ్రామంలో డ్వాక్రా సంఘాల మహిళలకు ఎంపీటీసీ సభ్యులు జామ, సపోటా తదితర మొక్కలను అందజేశారు.

రావికమతం: ప్రతి ఇంటి, పెరట్లలో పండ్ల మొక్కలను నాటుకోవాలని ఎంపీపీ పైలరాజు సూచించారు.వెలుగు కార్యాలయం వద్ద స్వయం సహాయక సభ్యులకు మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ, మండలం లో 5,402 పండ్ల మొక్కలను నాటాల న్నదే లక్ష్యమన్నారు. మొక్కలు నాటడంతో పర్యావరణం సమతుల్యాఆ ఉంటుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి మంచి వాతావరణం ఉండే విధంగా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపిఎం తిలక్, సర్పంచ్‌లు బంటు సన్యాసినాయుడు, ప్రసాద్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.


మొక్కలు ఇస్తున్న ఎంపిపి



విద్యార్థులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి

వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-రోలుగుంట: వర్షాకాలంలో వచ్చే వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, శుభ్రమైన ఆహారం, కాచిన నీటిని తీసుకోవాలని రోలుగుంట వైద్యాధికారి కిల్లాడ వెంకటశ్రావణి సూచించారు. ఈ సీజన్‌లో దోమలతో మలేరియా, డెంగ్యూ వ్యాధులు వచ్చే అవకాశం ఉందన్నారు. ఈగలతో డయేరియా వస్తుందన్నారు. కలుషిత నీటితో వ్యాధులు సంభవిస్తాయన్నారు. దోమ తెరలను విధిగా వాడాలని సూచించారు. గృహాల పరిసరాలలో నీటి నిల్వలు ఉండకుండా చూసు కోవాలని తెలిపారు. వారానికి ఒకసారి అంటే మంగళవారం ఆర్థోఫిజిషియన్(ఎముకల డాక్టర్) వస్తారన్నారు.



వినతిపత్రం చూపుతున్న ఎమ్మెల్యే

రిలే దీక్షలు విరమించాలి

ప్రజాశక్తి -కోటవురట్ల: రోడ్డు, పాఠశాల నిర్మాణానికి గొట్టువాడ శివారు అణుకు గిరిజన గ్రామస్తులు నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్ష సోమవారం నాటికి 11వ రోజుకు చేరుకుంది. మండలంలో వివిధ కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన స్థానిక ఎమ్మెల్యే గొల్ల బాబూరావు రోడ్డు, పాఠశాల నిర్మాణంకు జిల్లా కలెక్టర్ కు విన్నవించిన వినతిపత్రాన్ని శిబిరం వద్ద దీక్ష నిర్వహిస్తున్న వారికి ఎమ్మెల్యే చూపించారు, దీక్ష శిబిరానికి చేరుకొని దీక్ష విరమించాలని కోరారు. సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు అప్పలరాజు మాట్లాడుతూ, స్పష్టమైన హామీ ఇచ్చే వరకు దీక్షను విరమించేది లేదని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మండల సిపిఎం నాయకులు డేవిడ్‌రాజు, అణుకు గిరిజన గ్రామస్తులు పాల్గొన్నారు.

సౌకర్యాల కల్పనలో నిర్లక్ష్యం

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్: గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించడంలో వైసిపి ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందని జనసేన పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ ఇన్చార్జ్ రాజాన వీర సూర్యచంద్ర ఆరోపించారు. సోమవారం నాతవరం మండలం ఎస్‌బి.పట్నం గ్రామంలో మండల అధ్యక్షులు వెలగల వెంకటరమణ, నాయకులు ప్రసాద్, ముత్తా శ్రీనివాస్ ఆధ్వర్యంలో జనం కోసం జనసేన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సూర్యచంద్ర మాట్లాడుతూ, ఎస్‌బి.పట్నం గ్రామంలో మంచినీటి ట్యాంక్ శిథిలావస్థకు చేరిందన్నారు. 80 శాతం మందికి అమ్మఒడి డబ్బులు పడలేదని తెలిపారు. గ్రామంలో సిసి రోడ్లు లేవని, డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందన్నారు.



ఎంఇఒను సన్మానిస్తున్న యుటిఎఫ్ నేతలు

సమస్యలు పరిష్కరించాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి-మాడుగుల: ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని యుటిఎఫ్ నేతలు కోరారు. మాడుగుల ఎంఇఒ1గా బాధ్యతలు స్వీకరించిన పొందు రంగారావును కలిశారు. ప్రతి నెలా ఒకటవ తేదీన జీతాలు చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇతర నేతలు జగ్గారావు, కొండల రావు, సత్తి బాబు, శివ, ఆనంద్, మురళి, సింహాచలం, రామారావు, అప్పారావు పాల్గొన్నారు.

రోలుగుంట తహశీల్దార్‌పై విచారణ చేపట్టాలని

కెవిపిఎస్ ఆధ్వర్యంలో ఆందోళన

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్: రోలుగుంట మండలం తహశీల్దార్ పై జాయింట్ కలెక్టర్ విచారణ చేపట్టాలని కెవిపిఎస్ ఆధ్వర్యంలో స్థానిక ఆర్డిఓ కార్యాలయం ముందు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వంటావార్పు కార్యక్రమాన్ని చేశారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఈరెల్లి చిరంజీవి మాట్లాడుతూ, రోలుగుంట మండలంలో అనేక రెవెన్యూ అవకతవకలు జరిగాయని, వీటిపై సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రశ్నించిన వారిని రెవెన్యూ అధికారులు బెదిరిస్తున్నారన్నారు. నర్సీపట్నం రెవెన్యూ డివిజన్ పరిధిలోని రోలుగుంట మండలం రత్నంపేట పంచాయతీ పనసలపాడు రెవెన్యూ పరిధిలో జగనన్న రీ సర్వేలో సాగులో ఉన్నవారిని, లేనట్టు గానూ, సాగులో లేని స్థానికేతరులను, రియల్ ఎస్టేట్ వ్యాపారస్తులను సాగులో ఉన్నట్టుగా చూపించి రికార్డులు తయారు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రోలుగుంట తహసీల్దారిపై సమగ్రమైన విచారణ చేపట్టాలని గత రెండు నెలలుగా స్థానిక గిరిజనులు, దళితులు అనేక మార్లు ఆందోళన చేసినా అధికారులు పట్టించుకోలేదన్నారు. రెవెన్యూ అధికారులు సాగులో లేని రియల్ ఎస్టేట్ వ్యాపారస్తులతో కుమ్మక్కై దళితులకు అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. నిరసనలు మీడియాలో వచ్చినంత మాత్రాన ఒరిగేది ఏమీ లేదన్నట్లుగా తహసిల్దార్ భావిస్తున్నారని దుయ్యబట్టారు. వాస్తవానికి. సర్వే నెంబర్ 2,3,4,6,7,8,11లలో 25 ఎకరాలు భూమిని దళితులు, గిరిజనులు సాగు చేస్తున్నారని, అటువంటి భూమిని సాగులో లేనట్టు రికార్డ్ చేయడం అన్యాయమన్నారు. తక్షణమే సమగ్రమైన దర్యాప్తు చేసి వాస్తవాన్ని గుర్తించి రికార్డుల్లో నమోదు చేయాలన్నారు. వంటావార్పు చేపట్టి ఆర్డీవోకు వినతి పత్రాన్ని అందించారు.



నినాదాలు చేస్తున్న కెవిపిఎస్, పలు సంఘాల నేతలు

గిరిజనులకు న్యాయం చేస్తానని ఆర్డిఓ జయరాం హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కే.గోవిందరావు, రత్నంపేట మాజీ ఎంపీటీసీ సభ్యులు దుర్గబాబు, దళిత సంఘం నాయకులు చిలుకు, గేమిలి చిన్నబ్బాయి తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌పై కుట్రలు దారుణం

ప్రజాశక్తి - ఉక్కునగరం

వేలాది మందికి ఉపాధి కల్పిస్తూ రాష్ట్రాభివృద్ధిలో కీలకపాత్ర పోషించిన వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించేందుకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కుట్రలు చేయడం దారుణమని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు సోమవారానికి 886వ రోజుకు చేరుకున్నాయి. దీక్షా శిబిరంలో స్టీల్ ఎస్ఎంఎస్ - 1 విభాగానికి చెందిన కార్మికులు కూర్చున్నారు. వారినుద్దేశించి నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్ నిర్వీర్యానికి కుట్రలు పన్నుతున్నా కార్మికులు ఎంతో అంకితభావంతో పనిచేసి కర్మాగారాన్ని కాపాడుకోవడానికి కృషి చేస్తున్నారన్నారు. ఇటువంటి తరుణంలో కార్మికులకు రావాల్సిన ఆర్థిక ప్రయోజనాలపై ఉక్కు యాజమాన్యం దెబ్బకొట్టడం శోచనీయమన్నారు. ఇతర ప్లాంట్లలో వేతన ఒప్పందం అమలు జరిపి కార్మికులకు ఆర్థిక ప్రయోజనాలు చేకూరుస్తుంటే అందుకు భిన్నంగా వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌లో వ్యవహరించడం తగదన్నారు. ప్లాంట్‌కూ, తమకూ నష్టం చేకూర్చే చర్యలను కార్మికవర్గం చూస్తూ ఊరుకోదనే విషయం గుర్తెరగాలన్నారు. దీక్షల్లో పోరాట కమిటీ నాయకులు ఎస్.శ్రీనివాస్, పివి.రమణ, శ్రీనివాస్‌రెడ్డి, కర్రి సంతోష్ పాల్గొన్నారు.

రాలా బెల్లాపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్ :

నగరంలోని వెంకోజీపాలెంలో ఉన్న రాలా బెల్లా ఇంటర్నేషనల్ స్కూల్ అనుమతులు లేకుండా నడుస్తూ విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి లక్షలాది రూపాయల ఫీజులు వసూలు చేసి మోసగిస్తోందని స్కూలు తల్లిదండ్రుల కమిటీ కన్వీనర్, ఎన్‌పిటిసి ఇంజినీర్ పెద్ది నారాయణరావు అన్నారు. తక్షణం ఆ స్కూలుపై చర్యలు తీసుకోవాలని కోరారు. సోమవారం విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో 31వ వార్డు కార్పొరేటర్ బిపిన్ కుమార్ జైన్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కల్వర్టు నిర్మించరూ...


ప్రజాశక్తి-చీడికాడ: వాహనదారులు ప్రయాణ సమయంలో ఏమాత్రం వేమరపాటిగా వాహనాన్ని నడిపినా ఆసుపత్రి పాలు కాక తప్పదని స్థానికులు తెలిపారు. చీడికాడ మండలం కండివరం గ్రామం నుండి మాడుగులకు తారు రోడ్డు వేశారు. విషయం ఏమిటంటే మోసూరు వారి పాకల వద్ద తారు రోడ్డు వేసే సమయానికి కల్వర్టు పూర్తిగా పాడైపోయింది. కల్వర్టు నిర్మాణం చేపట్టకుండా దానిపై తూతూ మంత్రంగా తారు వేశారు.. మాడుగులకి నిత్యం ప్రయాణం చేసే వాహనదారులకు ఈ కల్వర్టు ప్రాణగండంగా మారింది. చీకటి పడితే వాహనదారులు రోడ్డు బాగానే ఉందనుకుని వేగంతో రావడంతో కల్వర్టు దగ్గర పెద్ద గొయ్యి ఉండడం గమనించక అనేక మంది ప్రమాదాలకు గురవుతున్నారు. కల్వర్టు దగ్గర అనేక ప్రమాదాలు జరుగుతున్నాయని అధికారపక్ష నాయకులకు, అధికారులకు తెలియజేసినా స్పందించ లేదని మోసూరు వారి కుటుంబీకులు, స్థానికులు చెబుతున్నారు. అధికారులు, నాయకులు ఇప్పటికైనా స్పందించి మోసూరు వారి పాకల వద్ద పూర్తిగా పాడైన కల్వర్టును మరమ్మత్తులు చేయాలని స్థానికులు, వాహనదారులు కోరారు.



మరమ్మతు చేపట్టని కల్వర్టు

మంచం పట్టిన మద్రేబు

ప్రజాశక్తి-అనంతగిరి: ఇటీవల కురుస్తున్న వర్షాలతో మలేరియా, టైఫాయిడ్ వంటి విషజ్వరాలు విజృంభిస్తున్నాయి. సకాలంలో వైద్య సేవలు అందక రోగులు మంచాన పట్టారు. అనంతగిరి మండలం పిన్నకోట ప్రభుత్వం ఆరోగ్య కేంద్రం పరిధి పెద్దకోట పంచాయతీ కొండ శిఖరం గ్రామమైన మద్రేబు గ్రామంలో సుమారు 30 మంది పైగా గిరిజనులు గత మూడు వారాల నుండి పలు వ్యాధులతో మంచం పట్టారు. పిన్నకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి 30 కిలోమీటర్లు కొండకోన నడుమ నుండి పిన్నకోట ఆసుపత్రికి, అనకాపల్లి జిల్లా దేవరాపల్లి మండలం వాలాబు పంచాయతీ బొడ్డగుమ్మి వరకు ఎనిమిది కిలోమీటర్లు డోలీలో వెళ్లాల్సి ఉంటుంది. అక్కడ నుంచి ఆటోలో దేవరాపల్లి చేరుతారు. కీర్తనకు డెంగీ ప్రబలడంతో కే.జీ.హెచ్ కి తరలించారు. కొండతాంబలి కవితకు జ్వరం, పిట్సు రావడంతో దేవరాపల్లి తరలించగా పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం కెజిహెచ్‌కు రిఫర్ చేశారు. పలువురు వివిధ వ్యాధులతో మంచం పట్టారు. వీరిలో కొండతాంబల్లి లింగన్న, కొండతాంబలి పూసే, కొండతాంబిల్లి .రవి, సునీత, అభి,.నిషాకా, అశోక్, చిన్ని, బిషీలతో పాటు 20 మంది మంచంపై పడి వైద్య కోసం ఎదురుచూస్తున్నారు. తక్షణమే మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరారు.



డోలీలో తరలిస్తున్న బంధువులు



వ్యాధులతో బాధపడుతున్న కుటుంబ సభ్యులు